కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్



దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని     తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ   సంపుటి :05   సంచిక :122   ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్   శుక్రవారం 28-08-2026   పేజీలు : 4   వెల : రూ. 3/-


## నకిలీ వైద్యుల ఉచ్చులో పడకండి: సీపీ సజ్జనార్

హైదరాబాద్,వైద్యం పేరిట అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుల పట్ల ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో కల్తీ ఆహారం పై ఉక్కుపాదం మోపిన నగర పోలీసులు, తాజాగా నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఉంచి 12 మందిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకున్నట్లు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. ఎలాంటి అర్హతలు, కనీస వైద్య పరిజ్ఞానం లేని వీరు అసలైన వైద్యులలా నటిస్తూ యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, బీపీ, షుగర్ మందులతో పాటు విచక్షణారహితంగా ఇంజెక్షన్లు, సెలైన్లు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరి అవగాహనారహిత చికిత్సల వల్ల ప్రజల ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని సీపీ పేర్కొన్నారు.నకిలీల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు క్లినిక్‌లు, ఆసుపత్రులకు వెళ్లినప్పుడు కొన్ని కీలక జాగ్రత్తలు పాటించాలని సీపీ సూచించారు. ఆసుపత్రుల వద్ద డీఎంహెచ్‌ఓ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వైద్యుల బోర్డులపై టీఎస్ఎంసీ కేటాయించిన రిజిస్ట్రేషన్ నెంబర్ ఉన్నాయో లేదో తప్పనిసరిగా సరిచూసుకోవాలన్నారు.



వైద్యులపై ఏమాత్రం అనుమానం వచ్చినా అధికారిక వెబ్‌సైట్ లో వివరాలను తనిఖీ చేసుకోవాలని, అవసరమైతే ఇతర నిపుణులైన వైద్యుల వద్ద సెకండ్ ఒపీనియన్ తీసుకోవాలని కోరారు. నకిలీ వైద్యుల సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

## మంత్రికి పవర్ కట్...

హైదరాబాద్, ఆగస్టు 27,తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం అత్యంత ఆసక్తికరమైన మలుపు తిరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానంతో కొండా ఫ్యామిలీ వైరం తారస్థాయికి చేరిన వేళ.. ఆమెను నేరుగా పదవి నుంచి తప్పించకుండానే, మంత్రిత్వ శాఖలో ఉన్న అధికారాలన్నింటికీ కత్తెర వేసే సరికొత్త ఆపరేషన్ మొదలైంది. ప్రత్యక్షంగా వేటు వేస్తే వచ్చే రాజకీయ నష్టాన్ని నివారిస్తూ, పరిపాలనాపరంగా ఉక్కిరిబిక్కిరి చేసి ఆమే స్వయంగా తప్పుకునేలా లేదా దిగివచ్చేలా చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు లక్ష్యంగా కనిపిస్తోంది.పర్యావరణ, అటవీ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖకు తాజాగా ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. మంత్రికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే, ఆమె తనకు అనుకూలంగా నియమించుకున్న దాదాపు 20 మందికి పైగా అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసింది. ఇందులో కీలకమైన ఐఎఫ్ఎస్ అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. వీరిని తక్షణమే మాతృశాఖలకు పంపించడంతో పాటు, సచివాలయం, క్షేత్రస్థాయి యంత్రాంగానికి బలమైన సంకేతాలు వెళ్లాయి. ఉన్నతాధికారులు ఇకపై మంత్రి నిర్ణయాల కంటే సీఎంఓ ఆదేశాలకే ప్రాధాన్యత ఇవ్వాలనే పరిస్థితిని తీసుకురావడం ద్వారా శాఖాపరంగా ఆమెను పూర్తిగా డమ్మీ చేసేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుటుంబం బహిరంగంగా విమర్శలు గుప్పించిన తర్వాత, ఆమెపై వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారని అంతా భావించారు. అయితే, ఆమెను నేరుగా మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తే ఒక బలమైన బీసీ మహిళా నేతపై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనే సామాజిక ముద్ర పడే ప్రమాదం ఉంది. ఈ 'బీసీ సెంటిమెంట్' రాజకీయంగా బూమరాంగ్ కాకుండా ఉండటానికే అధిష్టానం తాత్కాలికంగా ఈ పరోక్ష వ్యూహాన్ని ఎంచుకున్నట్టు సమాచారం.నేరుగా వేటు వేయకుండా అధికారాలను నియంత్రించడం ద్వారా.. మంత్రిగా ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోలేరు. పరిపాలనాపరంగా, రాజకీయంగా పార్టీలో ఆమె ఒంటరి అవుతుంది. స్వయంగా రాజీనామా చేసేలా మానసిక ఒత్తిడి పెంచడం లేదా అధిష్టానం వద్దకు వచ్చి రాజీపడేలా చేయడం



దీని వెనుక వ్యూహంగా ఉంది.మరోవైపు, కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ సెటిల్‌మెంట్ల వ్యవహారం చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. పాత ఆరోపణలు, సెటిల్‌మెంట్లపై పోలీసులు విచారణను ఒక్కసారిగా వేగవంతం చేశారు. గత కేసులను బయటకు తీసి దర్యాప్తు చేయడం వెనుక పక్కా వ్యూహం కనిపిస్తోంది. దీనివల్ల కొండా కుటుంబం కేవలం రాజకీయంగానే కాకుండా, చట్టపరమైన అంశాల్లోనూ పూర్తిగా డిఫెన్స్‌లో పడిపోతుంది. అవినీతి, అక్రమాల ఆరోపణల చుట్టూ చర్చను తిప్పడం ద్వారా కొండా సురేఖ సామాజిక కోణాన్ని లేదా 'బీసీ కార్డు'ను రాజకీయ రక్షణ కవచంగా వాడుకునే అవకాశాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా మూసివేసింది.ఏ రాజకీయ నాయకుడికైనా అధికారాలు లేని మంత్రి పదవిలో కొనసాగడం చిరాకు తెప్పిస్తుంది. చేతులు కాలకుండా ఆకులు పట్టుకునే చందంగా కాంగ్రెస్ నాయకత్వం వేసిన ఈ ఎత్తుగడ కొండా సురేఖను పూర్తి ఆత్మరక్షణలోకి నెట్టింది. అధికారం లేని శాఖను మోస్తూ ఉత్సవ విగ్రహంలా ఉండటమా? లేక పంతం వీడి సీఎం, అధిష్టానం ముందు లొంగిపోవడమా? అన్నది తేల్చుకోవాల్సిన సంకట స్థితిలో కొండా దంపతులు పడ్డారు. పరిపాలనాపరంగా హక్కులను గుల్ల చేస్తూ రాజకీయ పట్టు బిగించే ఈ వ్యూహం తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ రాజకీయ భవితవ్యాన్ని ఏ తీరానికి చేరుస్తుందో వేచి చూడాలి

## ప్రకృతి ఉగ్ర రూపం..నేపాల్ జలప్రళయం



నేపాల్:హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వేల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో 10 జిల్లాలను, వేల ఊర్లను వరద, బురద నీరు ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. బోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చింది" అని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. నది ప్రవాహంలో బండరాళ్లు కిందికి దూసుకొచ్చాయి. ప్రకృతి సృష్టించిన ఆకస్మిక విపత్తులో నదులు అనూహ్యంగా ఉప్పొంగడంతో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. బురదలో వందల మంది నేపాలీ ప్రజలు సజీవ సమాధి అయ్యారు. సహాయక బృందాలు బురదలో అడుగు పెడితే తెగిపోతున్న మనుషుల శరీరాలు..ఎక్కడికక్కడ వరదలో కొట్టుకొస్తున్న మృతదేహాలు కనిపిస్తూ కలవర పెడుతున్నాయి. వరద ఉధృతికి 12 జల విద్యుత్తు కేంద్రాలు ధ్వంసమవ్వడంతో ఎయిర్ పోర్టులు కొట్టుకపోయాయి. అయితే, ఈ వరదలు ఇక్కడితో ఆగకపోవచ్చని తెలుస్తోంది.అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంతయ్యారు. .. హైడ్రలాజికల్ అబ్జర్వేషన్స్ ప్రకారం.. గల్చి ప్రాంతం వద్ద త్రిశూలి నదిలో 30 నిమిషాల్లో నీరు 9 మీటర్ల ఎత్తుకు ఉప్పొంగింది.

## పర్యాటక కేంద్రంగా మిరాలం చెరువు : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్:హైదరాబాద్ మిరాలం ట్యాంక్ను ప్రముఖ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా సాగుతున్న పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ సాగుతున్న పనులను ఒక్కొక్కటిగా పరిశీలించారు. అత్యుత్తమ డిజైన్లతో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కొనసాగుతున్న పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ద్వారా అధికారులు వివరించారు. ప్రణాళికలను పూర్తిగా పరిశీలించిన తర్వాత ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ట్యాంక్ చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనులను ఓపెన్-టాప్ జీపులో ప్రయాణించి ఆ ప్రాంతాన్ని మొత్తంగా పరిశీలించారు. మిరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జ్ పనులను భారీ క్రేన్ సహాయంతో పైకి వెళ్లి చూశారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే చెరువు నుంచి మూసీలోకి వరద నీరు వెళ్లేలా నాలాను విస్తరించాలని చెప్పారు. పర్యాటకులు చెరువులో వాటర్ స్పోర్ట్స్ కోసం డిజైన్ చేయాలని, చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్నందున మిరాలం చెరువును, పరిసర ప్రాంతాలను పర్యాటకులకు ఆకట్టుకునేలా ఏర్పాట్లు జరగాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆకస్మిక పర్యటన సందర్భంగా మూసీ ర్ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల గళాన్ని అణచలేరు..

హైదరాబాద్,తెలంగాణలో విద్యార్థులు వరుసగా ఆందోళనలకు దిగుతున్నా వారి సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. పాలిటెక్నిక్, ఆయుష్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసనలు చేపడుతున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం నుంచి సరైన స్పందన రావడం లేదని విమర్శించారు.జీవో 97కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులను కలిసేందుకు తాను వెళ్లాల్సి ఉండగా, ప్రభుత్వం తనను గృహనిర్బంధంలో ఉంచిందని రాంచందర్‌రావు ఆరోపించారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచే తనను అడ్డుకోవడమే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన విమర్శించారు.విద్యార్థుల సమస్యలపై మాట్లాడే గొంతులను గృహనిర్బంధాలు, ఆంక్షలతో అణచివేయవచ్చని ప్రభుత్వం భావిస్తే అది పొరపాటేనని రాంచందర్‌రావు హెచ్చరించారు. "మమ్మల్ని మౌనంగా చేయలేరు. విద్యార్థుల తరఫున మా పోరాటం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు.రాష్ట్రంలో వివిధ వర్గాల విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కుతున్నారని ఆయన పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు ఆయుష్ విద్యార్థులు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన విద్యార్థులు కూడా ఆందోళనలు చేపడుతున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యలకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు.నిరసనలను అణచివేయడం, భిన్నాభిప్రాయాలను మౌనంగా చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిగా మారిందని రాంచందర్‌రావు



విమర్శించారు. ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే ప్రభుత్వం, నిరసన తెలిపే వారి హక్కులను మాత్రం గౌరవించడం లేదని ఆరోపించారు.విద్యార్థుల ఆందోళనలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేసిన ఆయన, వివాదాస్పదంగా మారిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.విద్యార్థుల ఆందోళనలను అణచివేసే ప్రయత్నాల కంటే వారి సమస్యలను విని పరిష్కరించడంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టాలని రాంచందర్‌రావు సూచించారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలతో పాటు ఆయుష్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాలపైనా ప్రభుత్వం సమగ్రంగా స్పందించాలని డిమాండ్ చేశారు.

## కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచేందుకు హరీశ్ రావు కుట్రలు



హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు, కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచేందుకు హరీశ్ రావు కుట్రలు చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. గురువారం బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇటీవలే మెదక్ ఎమ్మెల్యేలతో హరీశ్ రావు మీటింగ్ పెట్టారని ఈ మీటింగ్?లో కేసీఆర్ ఎన్టీఆర్‌లా పెద్ద మనిషి. కానీ ఆయన కొడుకు వారసత్వం ఇవ్వడం సరికాదని హరీశ్ రావు అన్నట్లు ఆ మీటింగ్‌లో ఉన్న ఒక ఎమ్మెల్యేనే నాకు ఈ విషయం చెప్పారని కవిత ఆరోపించారు. ఎన్టీఆర్ పేరు తీసుకున్నారంటే గుంటనక్క వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమైందని హరీశ్ రావును ఉద్దేశించి ఘాటు విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా తన హస్తగతం చేసుకొని ఆ తర్వాత బీజేపీ సపోర్ట్ తీసుకోవాలని కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. బీజేపీ?తో హరీశ్ రావు మిలాఖత్ ఉందని చెప్పటానికి నా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయన్నారు.

ఆర్ఎస్ఎస్ ప్రముఖుడితో మంతనాలు:

రాజ్ పుష్ప ఓపెన్ స్కై విల్లాస్?లో ఒక ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు వచ్చినప్పుడల్లా ఆయనకు పసుపు, మిరియాలు కలిపిన పాలు వెళ్తుంటాయని ఆ రోజు హరీశ్ రావు పూర్తిగా తన కార్యక్రమాలను రద్దు చేసుకొని ఆయనతో మీటింగ్ పెడతారని కవిత ఆరోపించారు. తాను ఇప్పుడు బీఆర్ఎస్?లో లేనని ఆ పార్టీ ఎలా పో

## గాల్లో దీపంలాగా ఈహెచ్ఎస్ అమలు.. ఉద్యోగులకు మాత్రం జీతంలో కోత



హన్మకొండ : ప్రభుత్వం మాటలు చెప్పింది తప్ప.. ఈ రాష్ట్రంలో ఈహెచ్ఎస్ అమలు కావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గురువారం హన్మకొండ కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. మొన్న మా దగ్గర ఖాజా మెయినోద్దీన్.. రిటైర్డ్ హెడ్‌మాస్టర్. వాళ్ల తండ్రికి హార్ట్ ఎటాక్ వస్తే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఏ ఆస్పత్రికి పోయినా ఈహెచ్ఎస్ లేదుపో అంటున్నరట. చివరగా ఒక ఆస్పత్రిలో జాయిన్ చేశారు. రూ.11 లక్షలు బిల్ అయింది.. ఈహెచ్ఎస్ వర్తించదు.. డబ్బు కట్టాల్సిందే అంటే నేను ఆస్పత్రికి వెళ్లి బతిమిలాడితే రూ.2-3 లక్షలు తగ్గించాల్సిన పరిస్థితి. అంటే ప్రభుత్వం మాటలు చెప్పింది తప్ప.. ఈ రాష్ట్రంలో ఈహెచ్ఎస్ అమలు కావడం లేదన్నారు.నేను నెట్ వర్క్ ఆస్పత్రులతో మాట్లాడిన. రెండు యూనియన్లున్నాయి. 11 కార్పోరేట్ ఆస్పత్రులు ఒక యూనియన్. రాష్ట్రవ్యాప్తంగా ఉండే ప్రైవేట్ ఆస్పత్రులది ఒక యూనియన్ అని హరీశ్ రావు పేర్కొన్నారు. ఏమైంది మీ ఈహెచ్ఎస్ ఎందుకు అమలు చేయడం లేదంటే మేం ప్రభుత్వంతో అగ్రిమెంట్ కాలేదు. మాకు ఆరోగ్యశ్రీ బకాయిలే పెండింగ్‌లో ఉన్నాయి. మాకు ఇచ్చిన ప్యాకేజీ గిట్టుబాటు కాదు.. మేము ఈహెచ్ఎస్ అమలు చేయడానికి సిద్ధంగా లేమని ఈ రోజులు ప్రైవేట్ ఆస్పత్రుల వాళ్లు చెబుతున్నారు. అంటే ప్రభుత్వం ఆస్పత్రులతో అగ్రిమెంట్ కాలేదు. ప్యాకేజీలు డిసైడ్ కాలేదు. కానీ ఉద్యోగులకు మాత్రం జీతంలో 1.5 శాతం కట్ చేసుకుంటూ పోతున్నరు. ఇప్పటికి 4 నెలలు కోత పెట్టిర్రు. కానీ ఈ 4 నెలల్లో పాత ఈహెచ్ఎస్ బంద్ అయింది.. కొత్త ఈహెచ్ఎస్ అమలులోకి రాలేదన్నారు. ఈహెచ్ఎస్ అమలు గాల్లో దీపం లాగా అయిపోయిందన్నారు హరీశ్ రావు.





## సంపాదకీయం

శుక్రవారం 28-08-2026

# మోదీ మాస్టర్ స్ట్రోక్!

భారత రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసే కీలకమైన 'జమిలి ఎన్నికల' విధానంపై మరోమారు చర్చ మొదలైంది. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే తమ సర్కారు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు, యూటీల శాసన సభ ఎన్నికలను కలిపి నిర్వహించడానికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నది. భారత ఎన్నికల వ్యవస్థలో పెద్ద మార్పు తీసుకురావాలనే ప్రయత్నం కొన్ని నెలలుగా కొనసాగుతోంది. లోక్‌సభ, విధానసభల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే 'వన్ నేషన్?వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చర్చలు తీవ్రమవుతున్నాయి. కమిటీ ఛైర్మన్ పీపీ చౌదరి ఇటీవలి అప్‌డేట్‌లో స్టేక్‌హోల్డర్లలో అధిక శాతం మద్దతు ఉందని, 2034కు బదులు 2029లోనే అమలు చేయవచ్చని సూచించారు. ఇదే ఇప్పుడు చర్చనీయాంశం అయింది. జేపీసీ ఛైర్మన్ పీపీ చౌదరి ప్రకారం, ఇప్పటివరకు సంప్రదించిన సివిల్ సొసైటీ, నిపుణులు, వివిధ సంస్థల్లో సుమారు 99 శాతం మంది జమిలి ఎన్నికలకు అనుకూలంగా మాట్లాడారు. కమిటీ పలు రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తోంది. రాజ్యాంగ సవరణ 2028లోగా పూర్తయితే, 2029 లోక్‌సభ ఎన్నికలతోపాటు కొన్ని విధానసభలను కలిపి నిర్వహించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతి కీలకం. కొన్ని రాష్ట్రాలు తమ అసెంబ్లీలను ముందస్తుగా రద్దు చేసి చక్రం సరిపోల్చుకుంటే మరింత సులభమవుతుంది. దేశంలోని 17 రాష్ట్రాల్లో బీజేపీ సొంతంగా అధికారంలో ఉన్నది. మరో ఐదు రాష్ట్రాల్లో బీజేపీ మిత్ర పక్షాలు అధికారంలో ఉన్నాయి. అలా మొత్తంగా 22 రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలు జరుగడానికి ముందే ఎన్డీయే పాలిత 11 రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరుగనున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే మరో నాలుగు ఎన్డీయే రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. మిగతా ఏడు ఎన్డీయేపాలిత రాష్ట్రాల ఎన్నికలు 2030-31 మధ్య జరుగనున్నాయి. దీంతో జమిలి ఎన్నికల కోసం తమ రాష్ట్రాల్లోని ప్రభుత్వాల పాలనను వెనక్కి కానీ ముందుకు కానీ జరుపుకునేందుకు పెద్దగా అభ్యంతరాలు ఉండకపోవచ్చని ఎన్డీయే సర్కారు భావిస్తున్నది. 2029లో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో 'జమిలి' ప్రక్రియకు పెద్దగా ఇబ్బందులు ఎదురు కావడం లేదు. అయితే 2028లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, త్రిపుర, తెలంగాణ, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం అసెంబ్లీల గడువు ముగుస్తున్నది. జమిలి ఎన్నికల కోసం ఆయా అసెంబ్లీల కాలాన్ని 5 నెలల నుంచి ఏడాది వరకు పొడిగించాల్సి ఉంటుంది. ఇక బీహార్, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీల గడువు 2030-31లో ముగియనున్నది. వాటి గడువును ఒకటి నుంచి రెండేండ్లు తగ్గించాల్సి వస్తుంది. అయితే, ఇంతటి భారీ సంస్కరణకు పార్లమెంట్ శాసనపరమైన మార్పులు చేయడంతో పాటు విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం అవసరమవుతుంది. ఈ ప్రతిపాదనను జార్ఖండ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న విపక్ష ప్రభుత్వాలు పెద్దయెత్తున వ్యతిరేకించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలోనే తొలుత తాము అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో జమిలి ప్రక్రియను కొనసాగించడానికి ఎన్డీయే ప్రభుత్వం కార్యచరణ సిద్ధం చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయిగతంలో 2034ని లక్ష్యంగా చెప్పినా, ఇప్పుడు ముందుకు తీసుకురావాలనే ఆలోచన బలపడుతోంది. ఇది రెండు దశల్లో అమలు కావచ్చు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం, ప్రియాంకా గాంధీ వాద్రా, సాగరికా ఘోష్, సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు. చిదంబరం బలంగా వ్యతిరేకించారు. ప్రస్తుత రూపంలోని ప్రతిపాదన రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని దెబ్బతీస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని వాదించారు. ఎన్నికైన అసెంబ్లీల పదవీకాలాన్ని తగ్గించడం సమస్యాత్మకమని అభిప్రాయపడ్డారు. మరోవైపు పద్మ అవార్డు గ్రహీతలు, కొన్ని పాలసీ గ్రూపులు జాతీయ ప్రయోజనంగా చూశారు. అయితే తగిన రక్షణలు, స్పష్టమైన నిబంధనలు అవసరమని సూచించారు. ఎన్నికల కమిషన్‌కు అధిక అధికారాలు రాకుండా జాగ్రత్తలు కావాలని కూడా అభిప్రాయాలు వచ్చాయి. మద్దతుదారులు పదేపదే ఎన్నికల వల్ల జరిగే ఆర్థిక నష్టం, అభివృద్ధి పనుల్లో అంతరాయం, మోడల్ కోడ్ వల్ల పాలనా స్తబ్దతను ఎత్తి చూపుతున్నారు. జమిలి ఎన్నికలు ఖర్చు తగ్గించి, పాలనకు స్థిరత్వం ఇస్తాయని వాదిస్తున్నారు. ఇక వ్యతిరేకులు ఫెడరల్ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం, ప్రాంతీయ సమస్యలు జాతీయ అంశాల్లో కలిసిపోయే అవకాశం, చిన్న పార్టీలపై ప్రభావం లాంటి వాటిని లెక్కపెడుతున్నారు. జేపీసీ నివేదిక శీతాకాల సమావేశం వరకు వాయిదా పడింది. రాజకీయ సమ్మతి ఏర్పడితే 2029లో పాక్షికంగా అయినా అమలు సాధ్యమే. లేకపోతే 2034 వైపు వెళ్తుంది. ఈ ప్రతిపాదన భారత ప్రజాస్వామ్య పనితీరును పునర్నిర్మించే ప్రయత్నం. సమ్మతి, రాజ్యాంగ రక్షణలు, రాష్ట్రాల సహకారం లేకుండా ముందుకు సాగడం కష్టం. భవిష్యత్ దిశను నిర్ణయించేది పార్లమెంట్ చర్చలు, రాజకీయ సంకల్పమే. కుల గణన విధానంపై విశ్లేషకులు, కార్యకర్తలు, రాజకీయ నేతలతో 'స్క్రోల్' సంస్థ మాట్లాడినప్పుడు పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారిలో అధికశాతం మంది కులాలను లెక్కించేందుకు ఎన్నుకున్న పద్ధతి లోపభూయిష్టమని అన్నారు. ఇటీవల బీహార్, తెలంగాణ తదితర రాష్ట్రాలు కులగణన నిర్వహించినప్పుడు 2011 మోడల్‌కు కట్టుబడి ఉండాలనే మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని వారు ప్రశ్నించారు. జనాభా లెక్కల్లో సేకరించే కుల డేటా నిరుపయోగంగా మారుతుందని కొందరు విమర్శకులు వాదించారు. 2021 సెప్టెంబర్ 21న మోదీ ప్రభుత్వం కుల గణన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అఫిడవిట్‌లోని 12(డి) పేరాలో '2011 జనాభా లెక్కల నిర్వహణకు ముందు కులాల రిజిస్ట్రీ ఏదీ సిద్ధం చేయలేదు' అని ఉంది. కాగా కులగణన కోసం ఎన్యూమరేటర్లు మొదట ప్రజలను షెడ్యూల్ కులాలు(ఎస్‌సీ) లేదా షెడ్యూల్ తెగలకు(ఎస్‌టీ) చెందినవారా కాదా అని అడుగుతారు. ఈ సమయంలో ప్రజలు తమ కులాన్ని ప్రకటించడానికి ఇష్టపడటం లేదని చెప్పే అవకాశం కూడా ఉందని 'ది హిందూ' పేర్కొంది. కాగా కులంపై పరిమితులు లేని ప్రశ్నలు ఉండటం వలన వైవిధ్యంతో కూడిన సమాధానాలు వస్తాయని ఇది అర్థవంతమైన విశ్లేషణను అందించదని విమర్శకులు వాదిస్తున్నారు. 2001 నుంచి జనాభా లెక్కల్లో కులం లెక్కింపుపై వాదన చేస్తున్న సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్ పాండే దీనిని ప్రణాళికాబద్ధమైన వైఫల్యం అని పేర్కొన్నారు. కులం గురించి పలు ప్రశ్నలు అడగడం వల్ల ఒకే సమాజానికి చెందిన వారు వేర్వేరు కులాల పేర్లతో తమను తాము గుర్తించుకునే అవకాశం ఉంది

# జనసేనలోకి విజయసాయిరెడ్డి....డేట్ కోసం వెయింటింగ్ ?



అమరావతి,విజయసాయిరెడ్డి అంటే వైఎస్సార్ కుటుంబం మనిషి అన్నది అందరికీ నిన్నటి దాకా తెలిసిన మాట. ఆయన ఈ రోజు జగన్ కి రాజకీయ ప్రత్యర్ధిగా అవతరించాలని ఆరాటపడుతున్నారు. వైఎస్సార్ ఫ్యామిలీతో మూడు తరాలుగా అనుబంధం పెనవేసుకుని వారి ఇంటి మనిషిగా అత్యంత నమ్మకస్తుడిగా మెలిగిన విజయసాయిరెడ్డి ఈ విధంగా జగన్ కి ఎదురు నిలుస్తారని ఎవరూ కలలో కూడా అనుకోలేదు. అదే రాజకీయం మరి. రాజకీయాల్లో బంధాలు అనుబంధాలు అన్నవి ఉండవని మరోసారి రుజువు అయింది. వైసీపీ ఆయనకు రెండు సార్లు రాజ్యసభ పదవి ఇచ్చింది. పార్టీలో కీలక స్థానం కల్పించింది. జగన్ తర్వాత ఆయనే అన్నంతగా వెలుగు వెలిగిన పార్టీని ఎందుకు ఆయన దూరం చేసుకున్నారో తెలియదు కానీ ఇపుడు జగన్ టార్గెట్ గా మరోసారి రాజకీయాల్లో రీ ఎంట్రీ ఇవ్వబోతున్నారు. హాయిగా వ్యవసాయం చేసుకుంటాను అని చెప్పిన విజయసాయిరెడ్డికి అక్కడ ఏడాది వ్యవధిలోనే బోర్ కొట్టినట్లుగా ఉందేమో. కొత్త పార్టీ కొత్త రాజకీయం అంటూ ఆయన మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతున్నా ఆయన ఆలోచనలు వేరేగా ఉన్నాయని చర్చ సాగుతోంది. ఆయన పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని జనసేనలో చేరుతారు అని గట్టిగా వినిపిస్తున్న మాట.

ట్విట్టర్ లో ఫుల్ యాక్టివ్ :

ఇదిలా ఉంటే ఈ మధ్య తరచుగా విజయసాయి రెడ్డి మీడియా ముందుకు వస్తున్నారు. కొత్త పార్టీ పెడతాను అని కూడా చెబుతున్నారు. ఆయన ట్విట్టర్ అయితే మరో సారి ఫుల్ గా యాక్టివ్ మోడ్ లోకి వచ్చేసింది. అంతే కాదు డైరెక్ట్ గా ఆయనే మీడియాకు తన ఫ్యూచర్ పాలిటిక్స్ గురించి లీక్స్ ఇస్తున్నారు. అయితే విజయసాయిరెడ్డి బీజేపీలోకి వెళ్లాలనుకున్నారు కానీ అక్కడ క్లియరెన్స్ లేదని కూడా హస్తిన రాజకీయాల్లో వినిపిస్తున్న మాట. ఎందుకు అంటే వైసీపీలో నంబర్ టూ పొజిషన్ లో ఉన్నా కూడా ఆ పార్టీకి ఏకంగా కుచ్చు టోపీ పెట్టారని అక్కడ నుంచి ఆయనకు వచ్చిన జవాబుగా ఉందని అంటున్నారు. ఎంతగా బీజేపీ ఫిలాసఫీని వల్లించినా అలాగే వీర హిందుత్వగా తనను తాను కొత్తగా విజయసాయిరెడ్డి ప్రకటించుకున్నా కూడా ఆయనను బీజేపీలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోరని అంటున్నారు.

ఫేస్ వాల్యూ ఏది బాసూ :

ఒక రాజకీయ పార్టీ పెట్టాలీ అంటే పెట్టే వారికి ఎంతో కొంత ఫేస్ వాల్యూ ఉండాలి. ఆయన్ని చూసుకునే జనాలు ఆ వైపు చూస్తారు విజయసాయిరెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో కనీసం ఎక్కడా గెలిచింది లేదు, ఆయన రెండు సార్లు రాజ్యసభకు వైఎస్ జగన్ పుణ్యమాని వెళ్ళగలిగారు. వైసీపీలో కీలక స్థానం దక్కింది అంటే జగన్ వల్లనే అని అంటారు. ఆయన వైసీపీ జనాలకు ఎక్కువగా, ఇతర రాజకీయ జనాలకు తక్కువగా మాత్రమే తెలిసిన వారుగా ఉంటారని అంటున్నారు. సగటు జనాలకు ఆయన అంటే ఎవరికీ తెలియదు అని కూడా అంటున్నారు. అలాంటి ఆయన తనను తాను ఎక్కువగా ఊహించుకుని పార్టీ సొంతంగా పెడతాను అని ముందుకు రావడం వర్తమాన రాజకీయ పరిస్థితి తెలియచేస్తున్నాయని సెటైర్లు వేస్తున్న వారూ ఉన్నారు. ఇక చూస్తే ఆయనకు ప్రత్యేకంగా ఫేస్ వాల్యూ ఏముంది అన్న ప్రశ్నలు కూడా అక్కడ వినిపిస్తున్నాయట.

టీడీపీలో నో చాన్స్ :

ఇక విజయసాయిరెడ్డి సొంత పార్టీ అని ఎందుకు అంటున్నారు అంటే బీజేపీ గురించి ఎంత పొగిడినా ఆయనను అక్కడ తీసుకునే ప్రశ్నే లేదని అంటున్నారు. ఇక టీడీపీలోకి ఆయన వెళ్ళాలని అనుకున్నా చంద్రబాబు అయితే ఆయనను తీసుకోవడానికి అసలు ఒప్పుకోరని అంటున్నారు. టీడీపీని చంద్రబాబుని ఆయన వైసీపీ వైపు నుంచి ఘాటుగా విమర్శించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయితే రాజకీయాల్లో ఇవన్నీ మామూలే అనుకున్నా విజయసాయిరెడ్డిని తీసుకోవడం వల్ల కలిగే రాజకీయ లాభం ఆయనకు తప్ప టీడీపీకి ఏమి ఉంటుంది అన్నది కూడా పసుపు శిబిరం కచ్చితంగా ఆలోచిస్తుంది అని అంటున్నారు. అందుకే సైకిలెక్కేందుకు మాజీ వైసీపీ నేత ప్రయత్నం చేసినా అక్కడ నో చాన్స్ అనే అంటున్నారు.

మొదట్లోనే డోర్స్ క్లోజ్ :

ఈ విధంగా చూస్తే విజయసాయిరెడ్డి రాజకీయ ఉబలాటం ఆరాటం ఎక్కువగానే ఉన్నా వైసీపీని వీడి 20 నెలలకు పై దాటినా ఆయనకు రాజకీయ దారి మాత్రం కనిపించడం లేదు, నిజానికి ఆయన వైసీపీకి రాజీనామా చేసి తన రాజ్యసభ పదవిని వదిలేసుకున్న మరుక్షణం బీజేపీ ఆదరించి అక్కున చేర్చుకుంటుందని భావించారు. అలా ఆ పార్టీలో చేరి తాను వైసీపీ నుంచి వదిలేసిన ఆ ఎంపీ సీటు నుంచే మళ్ళీ పోటీ చేయవచ్చు హ్యాపీగా జాతీయ పార్టీ ఎంపీగా హవా చలాయించవచ్చు అని భావించారు అని అప్పట్లో ప్రచారం సాగింది. కానీ బీజేపీ ఆయనను ఏ మాత్రం పట్టించుకోలేదు సరికదా ఆయన వదిలేసిన ఎంపీ పదవిని తమ పార్టీకి వీర విధేయుడు అయిన గోదావరి జిల్లాలకు చెందిన సీనియర్ నేతకు ఇప్పించుకుంది. దాంతో మొదట్లోనే విజయసాయిరెడ్డి వ్యూహాలకు బ్రేక్ పడిపోయింది అని అంటున్నారు.

కొత్త పార్టీ ఎందుకు మరి :

ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి ఆ మధ్య మీడియా ముందుకు వచ్చి వైసీపీ మీద జగన్ మీద కోటరీ మీద విమర్శలు చేయడం ద్వారా కొంత హడావుడి చేశారు. దాని వల్ల జగన్ వ్యతిరేక రాజకీయ శిబిరం తనను ఆదరిస్తుందని భావించారు అంటారు. అయితే ఆ వైపు నుంచి ఏ రకమైన రియాక్షన్ రాలేదు. దాంతో కొన్నాళ్ళు సొంత మీడియా హౌజ్ పెడతాను అని కూడా ప్రకటించారు. అయితే ఇపుడున్న కాంపిటేషన్ లో సొంత మీడియా పెట్టి దానికి టీఆర్పీ రేటింగ్ తీసుకుని రావడం నడపడం కష్టమే అని అంటున్నారు. పైగా అది ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అని అంటున్నారు. అంతే కాదు ఇప్పటికే ఉన్న మీడియా సంస్థలు అన్నీ నష్టాలతో సాగుతున్నాయని గుర్తు చేస్తున్నారు.

సామూహిక ఆత్మ హత్య ఇష్యూతో :

ఈ నేపథ్యంలో కొత్తగా ఒక ఇష్యూతో జనంలోకి రావాలని భావించిన విజయసాయిరెడ్డి నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఇష్యూతో మీడియా ముందుకు వచ్చారని అంటున్నారు. ఈ కేసుకు లవ్ జీహాదీ అంటూ మాట్లాడడమే కాకుండా జగన్ మీద హిందూ వ్యతిరేక ముద్ర వేసేలా ఘాటు విమర్శలు చేశారు విజయసాయిరెడ్డి. ఆయన ఈ తరహా విమర్శలు చేయడం వెనక బీజేపీ కటాక్షం కోసమే అని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే ఆయన కొత్త పార్టీ అని అంటున్నా జనసేన వైపు కూడా చూస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. ఆయనకు జనసేనలో ఉన్న ఒకనాటి వైసీపీ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితో మంచి రిలేషన్స్ ఉన్నాయి. దాంతో ఆయనతో ఈ మధ్య విజయసాయిరెడ్డి మాట్లాడారు అని అంటున్నారు.

జనసేనలోకి రెడీనా :

తన పార్టీలోకి బాలినేనిని విజయసాయిరెడ్డి ఆహ్వానించినా ఆయన సున్నితంగా నో చెప్పారని టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో జనసేనలోకి విజయసాయిరెడ్డిని బాలినేని ఆహ్వానించారు అని అంటున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి అక్కడ ప్రాధాన్యత ఉంటుందని చెప్పినట్లుగా ప్రచారం సాగుతోంది. తాను రాయలసీమ నెల్లూరు, ప్రకాశం జిల్లాలను ఆ పార్టీ తరపున చూస్తున్నాను అని ఆయన చెప్పారని అంటున్నారు. పవన్ తో ఈ విషయం ప్రస్తావించి ఓకే చేయిస్తామని హామీ ఇచ్చారని కూడా ప్రచారం అయితే సాగుతోంది. ఇక విజయసాయిరెడ్డి కూడా జనసేన ద్వారా బీజేపీకి అని ప్లాన్ బీ తో ఆ పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నారని పుకార్లు వినిపిస్తున్నాయి.

రాజకీయ అంచనాలు తప్పు:

బీజేపీకి దగ్గర కావాలనే వీర హిందుత్వగా విజయసాయిరెడ్డి ఒక్క సారిగా ఈ మధ్య మారిపోయారని కూడా అంటున్నారు. అయితే బీజేపీ ఆల్ రెడీ హిందుత్వ నినాదంతో ముందుకు సాగుతోంది. కొత్తగా విజయసాయిరెడ్డి నోటి వెంట ఆ మాట వింటే కమలం పార్టీ మురిసి ఆయనకు రెడ్ కార్పెట్ పరచేసే సీన్ ఉండదని అంటున్నారు. ఎందుకంటే ఈ మాజీ ఎంపీని తీసుకోవడం వల్ల ఏమిటి రాజకీయ లాభం అన్నదే ఏ పార్టీ అయినా కచ్చితంగా ఆలోచిస్తుంది అని అంటున్నారు. మొత్తానికి విజయసాయిరెడ్డి వైసీపీని వీడి తప్పు చేశారా లేక ఆయన రాజకీయ అంచనాలు తప్పు అయ్యాయా తెలియదు కాని భవిష్యత్తు మాత్రం అయోమయంగా ఉంది అని అంటున్నారు.

# ఉద్యోగుల తిరుగుబాటు తప్పదా...

కాకినాడ, ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వంపై ప్రభుత్వ ఉద్యోగులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నెల మూడో వారం వరకూ గడువు విధించారు. ఈలోపు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపకుంటే ఉద్యమ బాట పడతామని ఉద్యోగ సంఘాల నేతలు హెచ్చరించాయి. మూడో వారంలోపు చంద్రబాబు తమను పిలిచి చర్చించి సమస్యలను పరిష్కరించేలా హామీ ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలల మూడు నెలలు కావస్తున్నప్పటికీ తమ సమస్యల పరిష్కారినికి చొరవ చూపలేదని అంటున్నారు. అందుకే తాము ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నామని తెలిపారు. పి.ఆర్.సి., డీఏ, హెల్త్ కార్డులపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమస్యలు, డిమాండ్ల విషయంలో ఏపీ జేఏసీ నాయకత్వం దృఢమైన వైఖరితో వ్యవహరించాలని నిర్ణయించింది. పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ లపై సానుకూల నిర్ణయాలు కోరుతూ దశల వారీగా ఆందోళనలు చేయాలని నిర్ణయించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ తదితర అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఏపీ జేఏసీ నేతలు కోరుతున్నారు. అయితే మంత్రి వర్గ ఉప సంఘం పేరుతో ఇంకా కాలయాపన చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని కూడా ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ తదితర అంశాల పరిష్కారం సరెండర్ లీవ్, తదితర బకాయిల విడుదల ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ అఫ్ పెన్షన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ుఖ నుండి మినహాయింపు అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్?1లో చేర్చాలి. సీపీఎస్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి ధరలు పెరగుతుండటంతో... పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ క్లిష్టంగా మారుతోందని, ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఉద్యోగ సంఘ నేతలు చెబుతున్నారు. సామాన్య ఉద్యోగి కష్టాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైతే తగిన పోరాట కార్యాచరణ చేపట్టేందుకు ఏపీ జేఏసీ సిద్ధంగా ఉందని నాయకులు స్పష్టం చేశారు. నాయకులంతా సిద్ధంగా ఉండాలని కోరారు. ఆగస్టు చివరి వారంలో ఏపీ జేఏసీ విస్తృత రాష్ట్రస్థాయి సమావేశంలో ప్రస్తుత పరిస్థితులపై సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు

# ఇక పచ్చటి ప్రకాశం

ఒంగోలు, ఫ్లోరైడ్ రక్కసి కోరల్లో చిక్కుకుని, తీవ్ర కరవుతో అల్లాడిపోయిన పశ్చిమ ప్రకాశం నేలలకు జీవనాడి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కల ఎట్టకేలకు సాకారమవుతోంది. మూడు దశాబ్దాల క్రితం 1996లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మళ్లీ తన చేతుల మీదుగానే తొలి దశను జాతికి అంకితం చేసే స్థాయికి తీసుకురావడం ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగ చరిత్రలో ఒక అద్భుత ఘట్టం. ప్రకాశంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీరు, సుమారు 23 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పం నేడు సంపూర్ణ వాస్తవ రూపం దాల్చింది. వెలిగొండ ప్రాజెక్టు ప్రస్థానాన్ని నిశితంగా గమనిస్తే.. చంద్రబాబు అధికారంలో ఉన్న కాలంలోనే ఈ ప్రాజెక్టు పనులు పరుగులు తీశాయి. నల్లమల అడవుల గుండా అత్యంత సంక్లిష్టమైన రెండు భారీ సొరంగాలను తవ్వి కృష్ణా జలాలను తరలించే ఈ ఇంజనీరింగ్ అద్భుతాన్ని గత పాలకులు ఖర్చు దండగ అనుకుంటూ తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఎన్నికల ముందు అరకొర పనులతో ప్రారంభోత్సవాల డ్రామాలు ఆడినప్పటికీ, క్షేత్రస్థాయిలో నీటిని నింపే పనులు మాత్రం ముందుకు సాగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టువదలని విక్రమార్కుడిలా చంద్రబాబు నిధుల కొరతను అధిగమించి, గత రెండేళ్ల కాలంలోనే రూ. 2,250 కోట్లకు పైగా వెచ్చించి మొదటి దశ పనులను శరవేగంగా కొలిక్కి తెచ్చారు. చరిత్రలో ఏ భారీ నీటిపారుదల ప్రాజెక్టులోనూ లేని విధంగా, జలాశయంలోకి నీటిని విడుదల చేయడానికి ముందే ముంపు బాధితులకు పునరావాసం, పరిహారం పూర్తి చేయడం చంద్రబాబు ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనం. గతంలో ప్రాజెక్టులు పూర్తయినా నిర్వాసితులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే దుస్థితి ఉండేది. కానీ వెలిగొండ విషయంలో ఆ పరిస్థితి రానివ్వకుండా, ప్రాజెక్టును ప్రారంభించే సమయానికే మూడో విడత కింద రూ. 250 కోట్ల పరిహారం విడుదల చేశారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 6,206 ముంపు కుటుంబాలకు రూ. 768 కోట్లకు పైగా చెల్లించి, దాదాపు 85 శాతం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని పారదర్శకంగా పూర్తి చేసి బాధితుల కన్నీళు తుడిచారు. నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం అందించి వారిని ఆదుకోవడంతో పాటు, అటు దశాబ్దాలుగా చుక్క నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేయడంతో ఇటు నిర్వాసితులు, అటు అన్నదాతలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నల్లమల సాగర్ జలాశయం ద్వారా కరవు నేలలు సస్యశ్యామలం కాబోతుండటం ప్రాంతీయ అభివృద్ధికి నూతన ఊపునిస్తోంది. చిత్తశుద్ధి, సంకల్ప బలం ఉంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా దశాబ్దాల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయవచ్చని నిరూపిస్తూ.. చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ, ప్రకాశం ప్రాంత ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు.

## కాంట్రాక్టర్‌గా కాదు..కూలోడిగా పనిచేసింది రైతుల కోసమే

గత ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ నిర్మించిన ప్రధాన కాలువలకు బొక్కలు పెట్టి కేవలం ప్రాజెక్టుల పేరున జీవోలు మంజూరు చేయించి కమిషన్లు దండుకు తిన్నారే తప్ప ఏ ప్రాజెక్టు నువ్వు పూర్తిస్థాయిలో నిర్మించలేదని నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించే స్థాయికి ప్రాజెక్టును తీసుకువచ్చామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి. తెలిపారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేశ్వర్ రెడ్డిలతో కలిసి వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి కర్నేతండా లిఫ్ట్ ఇరిగేషన్ పంపులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుత. రూ. 87.53 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 18 తండాల పరిధిలో మొత్తం 4,235 ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు. ఇందులో వనపర్తి జిల్లాలో 3,384 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 851 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ. 87 కోట్లతో జీవో తీసుకువచ్చినా, సుమారు రూ. 47 కోట్లు ఖర్చు చేసి పనులను మధ్యలోనే నిలిపివేశారని ఎమ్మెల్యే తెలిపారు. మిగిలిన పనులను ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా పూర్తి చేస్తూ ఇప్పటివరకు సుమారు రూ. 29 కోట్లు ఖర్చు చేసిందన్నారు. మిగిలిన పనులు, భూసేకరణ తదితర అంశాలకు అవసరమైన నిధులు సమకూర్చి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో

# కేరళలో ట్రీట్ మెంట్ కు పవన్...



విజయవాడ, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ కేబినెట్ సమావేశాలకు వరుసగా గైర్హాజరవుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి తర్వాత కేబినెట్‌లో కీలక స్థానం కలిగిన డిప్యూటీ సీఎం తరచూ సమావేశాలకు దూరంగా ఉండటం.. ప్రభుత్వ పరిపాలనపై, జనసేన పాత్రపై ప్రతిపక్షాలకు విమర్శలు చేసే అవకాశం కల్పిస్తోంది. పవన్ కళ్యాణ్ గైర్హాజరీకి ప్రధాన కారణం ఆయన ఆరోగ్య పరిస్థితేనన్న చర్చ సాగుతోంది. గతంలో ఎదురైన గాయాలు, వెన్ను సంబంధిత సమస్యలు, అనారోగ్య సమస్యల కారణంగా ఆయనకు అప్పుడప్పుడు విశ్రాంతి అవసరమవుతోందని తెలుస్తోంది. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత నిరంతర పర్యటనలు, ప్రజా కార్యక్రమాలు, అధికారిక సమీక్షలు, పార్టీ వ్యవహారాలతో పాటు దీక్షలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా ఆయనపై శారీరక ఒత్తిడిని పెంచుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ.. పాలనకు నిరంతర అందుబాటు కూడా కీలకమే. ముఖ్యంగా కేబినెట్ సమావేశాల్లో విధానపరమైన నిర్ణయాలు, శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చలు జరుగుతాయి కాబట్టి గైర్హాజరు రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంటోంది. పవన్ కళ్యాణ్ రాజకీయ బాధ్యతలతో పాటు గతంలో ఒప్పుకున్న సినిమాల షూటింగ్‌లను పూర్తి చేస్తున్నారు. దీంతో ఆయన షెడ్యూల్‌పై అదనపు ఒత్తిడి ఏర్పడుతోందన్న అభిప్రాయం ఉంది. ఒకవైపు సినిమా షూటింగ్‌లు, మరోవైపు మంత్రిగా పర్యటనలు, సమీక్షలు, పార్టీ కార్యక్రమాలు కొనసాగితే విశ్రాంతికి సమయం తగ్గిపోవడం సహజం. గతంలో సినిమా రంగంలో ఉన్న ఫ్లెక్సిబుల్ షెడ్యూల్‌కు భిన్నంగా.. ప్రభుత్వ వ్యవహారాల్లో నిర్ణీత సమయాల్లో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంటుంది. ఇక్కడే పవన్‌కు అసలు సవాలు ఎదురవుతోంది. సినిమా, రాజకీయాలు రెండింటినీ సమన్వయం చేయడం కంటే.. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పరిపాలనకు ప్రాధాన్యత ఇవ్వడం ఇప్పుడు మరింత అవసరం. పవన్ కళ్యాణ్‌కు అప్పగించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలతో నేరుగా సంబంధం ఉన్న కీలక శాఖలు. ఈ శాఖల్లో విధాన నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాల్సి ఉంటుంది. కేబినెట్ సమావేశాలకు వరుసగా దూరంగా ఉండటం వల్ల నిర్ణయ ప్రక్రియలో జనసేనకు సంబంధించిన రాజకీయ ప్రాధాన్యం తగ్గే అవకాశం ఉందనే చర్చ కూడా జరుగుతోంది. అయితే దీనిని పవన్ శాఖల పనితీరుతో నేరుగా ముడిపెట్టే ముందు.. ఆయన గైర్హాజరీకి ఉన్న వాస్తవ కారణాలు, శాఖల పనితీరు వంటి అంశాలను విడిగా చూడాల్సి ఉంటుంది. ఆరోగ్య సమస్యలు నిజంగా ఉంటే వాటి నుంచి పూర్తిగా కోలుకోవడం మొదటి ప్రాధాన్యత. అదే సమయంలో సినిమా కమిట్‌మెంట్లను ఒక దశలో ముగించి, రాజకీయ బాధ్యతలకు స్పష్టమైన సమయాన్ని కేటాయించడం అవసరం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంటి నిరంతరం పనిచేసే నాయకుడితో కలిసి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నేపథ్యంలో పవన్ తన పాత్రను మరింత స్పష్టంగా, నిరంతరంగా చూపించాల్సిన అవసరం ఉంది. కేబినెట్ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం, శాఖలపై ప్రత్యక్ష పర్యవేక్షణ పెంచడం, ప్రభుత్వ నిర్ణయాల్లో చురుకైన భాగస్వామ్యం చూపించడం ద్వారా ప్రస్తుతం వినిపిస్తున్న విమర్శలకు సమాధానం చెప్పవచ్చు. పవన్ కళ్యాణ్‌కు ఇప్పుడు అసలు పరీక్ష రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కాదు.. ఆరోగ్యం, సినిమా, ప్రభుత్వం అనే మూడు బాధ్యతల మధ్య సరైన సమతుల్యత సాధించడమే.

## ఇంద్రకీలాద్రిని దర్శించుకున్న సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్

విజయవాడ: భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డాక్టర్ పవన్ కుమార్ శర్మ విజయవాడలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఇంద్రకీలాద్రిని దర్శించుకున్నారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర కూడా పాల్గొన్నారు. ఆలయ మర్యాదల ప్రకారంఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. శ్రీ పవన్ కుమార్ శర్మ విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు.

## ఉద్యోగ సంఘాల మధ్య ఆధిపత్య పోరు

గుంటూరు ,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సిన సంఘాల్లో అంతర్గత ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. ఉద్యోగ వర్గాల్లో బలమైన పట్టు కోసం ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్ మధ్య తీవ్రమైన పోటీ వాతావరణం నెలకొంది. పెండింగ్ డీఏలు , పే రివిజన్ కమిషన్ నియామకం, పాత పెన్షన్ స్కీమ్ , పెండింగ్ బిల్లుల విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై పోటాపోటీగా ప్రకటనలు గుప్పిస్తూ ఇరు నేతలు మీడియా వేదికగా బలప్రదర్శనకు దిగుతున్నారు. ఉద్యోగుల పక్షాన తామే అసలైన గొంతుకగా నిలుస్తున్నామనే ముద్ర వేయించుకునేందుకు సాగుతున్న ఈ ప్రయత్నం సంఘాల మధ్య ఐక్యతను దెబ్బతీస్తోంది.క్షేత్రస్థాయిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కంటే సంఘాల రాజకీయ మైలేజీకే నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ముందు విడివిడిగా వినతిపత్రాలు సమర్పించడం, విడివిడిగానే ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వడం ద్వారా ఉద్యోగులను రెండు వర్గాలుగా విభజిస్తున్నారనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్ నియామకం, డీఏ బకాయిలపై ఎవరు ముందుగా ప్రభుత్వాన్ని ఒప్పించారనే క్రెడిట్ కొట్టేయడమే లక్ష్యంగా ఇరు వర్గాలు పావులు కదుపుతున్నాయి. ప్రభుత్వ పెద్దలతో ఎవరు సన్నిహితంగా ఉంటూ ఉద్యోగుల పనులు చేయిస్తారనే పోటీ కూడా వీరి ఆధిపత్య సమరానికి మరింత ఆజ్యం పోస్తోంది.ఈ నాయకుల వ్యక్తిగత ప్రతిష్ట, అంతర్గత రాజకీయాల కారణంగా అసలు ఉద్యోగుల ప్రయోజనాలు గాల్లో దీపంలా మారుతున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆయా సమయాల్లో ప్రభుత్వానికి అనుకూలంగానో లేదా ఉద్యమాలను నీరుగార్చేలానో వ్యవహరించారనే ఆరోపణలు ఇప్పటికే ఇరు నేతలపై ఉన్నాయి. గతంలో ఉమ్మడి పోరాటాలతో ప్రభుత్వాలను కదిలించిన చరిత్ర కలిగిన ఉద్యోగ సంఘాలు, నేడు కేవలం నాయకుల ఉనికి, భవిష్యత్ రాజకీయ ఆకాంక్షల కోసం వేర్వేరు కుంపట్లు పెట్టుకోవడం సాధారణ ఉద్యోగుల్లో తీవ్ర నిరాశను నింపుతోంది.ఒకే డిమాండ్ కోసం విడివిడిగా ఉద్యమాలు చేయడం వల్ల ప్రభుత్వానికి సాకులు చెప్పుకునే అవకాశం దక్కుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. నాయకులు తమ వ్యక్తిగత రాజకీయాలను, ఆధిపత్య పోరును పక్కన పెట్టి ఐక్య కార్యాచరణతో ముందుకు రాకపోతే ఉద్యోగుల హక్కులు సాధించుకోవడం మరింత క్లిష్టంగా మారుతుందని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం వైసీపీ హయాంలో ఉద్యోగ సంఘాలు చేసిన విన్యాసాలను చూసిన తర్వాత అసలు వారి డిమాండ్లను పట్టించుకోవడం లేదు. తాము చేయాలనుకున్నదే చేస్తోంది.

## బెజవాడ బరిలో వారసులు

విజయవాడ, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి క్రమంగా పెరుగుతోంది. అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ, జనసేన , భారతీయ జనతా పార్టీ  తమ తమ వ్యూహాలతో ఎన్నికల సన్నాహకాల్లో నిమగ్నమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్ పదవులతో పాటు పట్టణ ప్రాంతాల్లో మేయర్, చైర్‌పర్సన్ స్థానాలపై రాజకీయ పార్టీల దృష్టి ఎక్కువగా ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో మేయర్ పీఠాన్ని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు.ఈ క్రమంలో విజయవాడ మేయర్ పదవికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రాష్ట్ర రాజకీయాల్లో విజయవాడకు ఉన్న ప్రాముఖ్యత, అమరావతి కి సమీపంలో ఉండటం, నగరంలో ఉన్న రాజకీయ చైతన్యం కారణంగా ఇక్కడి మేయర్ స్థానం కోసం పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ  విజయవాడ మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. అయితే ఈసారి పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని నగర పాలనపై పట్టు సాధించాలని టీడీపీ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.మేయర్ పదవి కోసం టీడీపీలో ఇప్పటికే పలువురు ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో రాజకీయ కుటుంబాలకు చెందిన వారసుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం  నుంచి వరుసగా విజయం సాధించిన ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు  కుటుంబం నుంచి కూడా ఒక పేరు చర్చకు వస్తోంది. తన కుమారుడిని రాజకీయాల్లోకి తీసుకురావడానికి మేయర్ పదవి మంచి వేదికగా ఉంటుందని బోండా ఉమా భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఇటీవల బోండా కుమారుడు రాజకీయ అంశాలపై స్పందిస్తూ మీడియా ముందుకు రావడం కూడా ఈ ఊహాగానాలకు బలం ఇచ్చింది. దీంతో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. ముఖ్యంగా విజయవాడ మేయర్ ఎన్నికల్లో కాపు సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని టీడీపీ పరిశీలిస్తే, బోండా కుటుంబానికి అవకాశం దక్కవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.మరోవైపు విజయవాడ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న వంగవీటి కుటుంబం ఎ) పేరు కూడా తెరపైకి వస్తోంది. వంగవీటి రంగా కుమార్తె ఆశా కిరణ్ కొంతకాలంగా రాజకీయంగా చురుకుగా వ్యవహరిస్తున్నారు. గతంలో విశాఖపట్నంలో  నిర్వహించిన రంగానాడు కార్యక్రమం ద్వారా ఆమె రాజకీయంగా చర్చలోకి వచ్చారు. ఆమె జనసేన వైపు వెళ్తారనే ప్రచారం కూడా గతంలో జరిగింది.అయితే ఇప్పుడు ఆశా కిరణ్‌ను టీడీపీలోకి తీసుకువచ్చి విజయవాడ మేయర్ అభ్యర్థిగా నిలబెట్టే ఆలోచన ఉందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. వంగవీటి కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు కాపు సామాజిక వర్గాన్ని మరింత దగ్గర చేసుకునే వ్యూహంలో భాగంగా దీనిని చూడవచ్చని విశ్లేషణలు సాగుతున్నాయి. ఇప్పటికే వంగవీటి రాధాకృష్ణ టీడీపీలో  కొనసాగుతున్నారు.మేయర్ పీఠం కోసం పోటీ పడుతున్న పేర్లు, సామాజిక సమీకరణాలు, రాజకీయ వారసుల ప్రవేశం వంటి అంశాలు ఎన్నికల సమయానికి మరింత స్పష్టత పొందే అవకాశం ఉంది. చివరకు పార్టీ అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. విజయవాడ మేయర్ ఎన్నిక కేవలం ఒక నగర పాలక సంస్థ పోరుగా కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావం చూపించే పోటీగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### అల్వాల విద్యార్థుల చిరకాల కల సాకారం

గోనెగండ్ల, :గోనెగండ్ల మండల పరిధిలోని అల్వాల గ్రామ విద్యార్థుల చిరకాల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఉన్నత విద్య కోసం పెద్ద నెలటూరు గ్రామానికి వెళ్లే విద్యార్థులు గత కొంతకాలంగా సరైన బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఉదయం వేళ సరైన సమయానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు గంటల తరబడి బస్టాప్ లోనే వేచి ఉండాల్సి వచ్చేది. దీంతో పాఠశాలకు ఆలస్యంగా చేరుకోవడం, తరగతులు మిస్ అవ్వడం వంటి సమస్యలతో చదువులో వెనుకబడుతున్నారు. ఆటోలను ఆశ్రయిస్తే అధిక చార్జీల భారం తల్లిదండ్రులపై పడుతోంది.ఈ విషయాన్ని గమనించిన గ్రామ పెద్దలు, పాఠశాల యాజమాన్యం చొరవ తీసుకున్నారు. ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో అధికారులతో మాట్లాడి విద్యార్థుల ఇబ్బందులను వివరించారు. వారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ అధికారులు అల్వాల నుండి పెద్ద నెలటూరు మీదుగా ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో అల్వాల గ్రామ విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం

# వైసీపీని జగనే నడపాలి!



వైసీపీని పార్టీ అధినేతగా వైఎస్ జగనే నడిపితే బాగుంటుందన్న అభిప్రాయం ఆ పార్టీ మెజార్టీ నేతల్లో వుంది. అదేంటి, జగనే కదా నడిపేదని ఎవరైనా ప్రశ్నించొచ్చు. నిజమే, పార్టీ అధినేతగా వైఎస్ జగన్ కనిపిస్తారు. జగనే నడుపుతున్నట్టు అనిపిస్తుంది. కానీ జగన్‌లో ఓపికలేని తనమో, ఇంకో కారణమో తెలియదు కానీ, ఇంకెవరికో బాధ్యతలు అప్పగిస్తారు.అందుకే వైసీపీ అంటే జగన్ కాకుండా, ఇంకెవరెవరో ప్రముఖంగా కనిపిస్తుంటారు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇదే తప్పు జరిగింది. తండ్రి వైఎస్సార్‌లా మంచి పరిపాలన అందిస్తారని తాము జగన్‌ను ఎన్నుకుంటే, ఆయన మాత్రం బయటికి రాకుండా, మరెవరికో బాధ్యతలు అప్పగించారనే ఆవేదన అన్ని వర్గాల ప్రజల్లోనూ వుంది.మరీ ముఖ్యంగా ఉద్యోగులైతే తమ విషయంలో జగన్‌కు బదులు, ఇతర వైసీపీ నాయకులు అవాకులు చెవాకులు మాట్లాడారనే కోపంతో రగిలారు. దానికి వైసీపీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. అభ్యర్థుల ఎంపికలోనూ ఇంతే. ఎవరో ఏదో చెప్పడం, జగన్ ఆమోదముద్ర అనేది కేవలం సాంకేతిక అంశంగా తయారైంది. ఈ ధోరణి వైసీపీకి చాలా ప్రమాదం.వైసీపీ కోఆర్డినేటర్లు, ఇతరత్రా పేర్లతో రాష్ట్రంలోని మూడు, నాలుగు ప్రాంతాలను కొందరికి కట్టబెట్టడం వైసీపీలో ఆనవాయితీగా వస్తోంది. టీడీపీలో ఇలాంటి ధోరణి అసలు కనిపించదు. టీడీపీ అంటే కేవలం చంద్రబాబు, నారా లోకేశ్ మాత్రమే కనిపిస్తారు. ఎలాంటి నిర్ణయాలైనా వారే తీసుకుంటారు. అంతా వాళ్ల ఆదేశాల మేరకే టీడీపీ నడుస్తుంటుంది.కానీ వైసీపీలో విచిత్రమైన పరిస్థితి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడైతే, ఉత్తరాంధ్రను జగన్ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరి చేతుల్లో జగన్ పెట్టారు. వైసీపీ ఐదేళ్ల అధికారం పూర్తయ్యే లోపు... ఇద్దరూ ఉత్తరాంధ్రలో వైసీపీ అంటే గజగజ వణికిపోయేలా చేశారు. ఇద్దరూ సొంత ఆదాయం పెంచుకునేందుకు ఉత్తరాంధ్రలో మైనింగ్ ఒకరు, భూముల్ని మరొకరు కొల్లగొట్టారన్న ఆరోపణలున్నాయి. వీళ్లలో ఒకరు పార్టీ ఓడిపోయాక, వైసీపీని వీడి, ఇప్పుడు నీతులు చెబుతున్నారు.అంతిమంగా 2024 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో వైసీపీని గుండుకొట్టించారు. ఒక్క ఉత్తరాంధ్ర మాత్రమే కాదు, కోస్తా, ఇతర ప్రాంతాలను కూడా కేవలం తన సామాజిక వర్గానికి చెందిన నాయకులకే కట్టబెట్టారు. దీంతో వైసీపీ అంటే కేవలం ఒక సామాజిక వర్గానికే చెందిన పార్టీ అనే నెగెటివ్ ముద్ర పడింది. వైసీపీ ఓడిపోయిన తర్వాత, గుడ్డిలో మెల్ల అనే సామెత చందంగా, ఆయా ప్రాంతాల్లో బలమైన సామాజిక వర్గాలకు చెందిన నేతలకు బాధ్యతలు అప్పగించారు.కానీ జగన్ పెట్టుకున్న నమ్మకాన్ని కొందరు ముఖ్య నేతలు వమ్ము చేస్తున్నారు. తమ ఇష్టాయిష్టాలన్నింటినీ పార్టీపై చూపుతున్నారు. కేవలం వైఎస్ జగన్‌కు మాత్రమే విధేయతగా వుంటే కుదరదన్నట్టు వైసీపీ ముఖ్య నేతలు వ్యవహరిస్తున్నారు. జగన్ కంటే ముందు, తమకు బానిసలుగా వుంటేనే, వైసీపీలో భవిష్యత్ వుంటుందనే రీతిలో వ్యవహరిస్తున్నారనే విమర్శ వుంది.ఎవరో కొందరు చెబితే, అనర్హులకు పెద్దపీట వేయడం, ప్రజాబలం ఉన్నా పక్కన పెట్టడం వైసీపీలో చోటు చేసుకుంటోందన్న చర్చ జరుగుతోంది. జగన్, వైసీపీ నాయకుల మధ్య నేరుగా ఆత్మీయ సంబంధాలు లేకపోవడం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయి. ఇతరుల అభిప్రాయాలు పార్టీపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.ఉదాహరణకు నెల్లూరులో బీసీ సామాజిక వర్గానికి చెందిన యాదవ కార్పొరేటర్‌కు జగన్ అంటే పిచ్చి. ఎందుకనో ఆయనంటే నెల్లూరు వైసీపీ సమన్వయకర్త , ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డికి అసలు పడదు. దీంతో రాత్రికి రాత్రే ఆయన పదవిని ఊడగొట్టారు. ఇది కేవలం చిన్న ఉదాహరణ మాత్రమే. అలాగని జగన్‌ను మాత్రమే ప్రేమిస్తూ, కిందిస్థాయి నాయకుల్ని ఖాతరు చేయొద్దనడం సరైంది కాదు. అధిష్టానం పెద్దల వద్ద పలుకుబడి వుందని, ఇంకెవరినీ లెక్క చేయమన్నట్టుగా వ్యవహరిస్తే, క్రమశిక్షణ దెబ్బ తింటుంది. పార్టీలో తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడుతాయి. అలా జరగకూడదు.అధిష్టానం పెద్దలు మొదలుకుని, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల వరకూ పార్టీలో సమన్వయం అవసరం. అది లేకపోతే , పార్టీ సరైన దారిలో నడవదు. వైఎస్ జగన్ తరచూ పార్టీ పంథాపై పర్యవేక్షిస్తే, సమస్యలన్నింటికీ పరిష్కారం దొరుకుతుంది. ఆయనకేమో పట్టించుకునే తీరిక, ఓపిక ఉన్నట్టుగా కనిపిరడం లేదు.ఆ రెడ్డికి, ఈ రెడ్డికి బాధ్యతలు అప్పగించామని, అంతా వాళ్లే చూసుకుంటారన్నట్టుగా వైసీపీని నడిపే తీరు చూస్తే అర్థమవుతుంది. జగన్ నమ్ముకున్నోళ్లేమో, తమ ఇష్టానుసారం నడుపుతున్నారు. పార్టీని నడిపేవాళ్లను తప్పు పట్టలేం. ఎందుకంటే, వాళ్లకు చేతనైంది, తెలిసింది అదే. అంతిమంగా, తాను నమ్ముకున్నోళ్ల వ్యవహార శైలి పార్టీపై పడుతుందనే స్పృహ వైఎస్ జగన్‌కు వుండాలి. దురదృష్టవశాత్తు ఆ ఆలోచన జగన్‌లో ఎంత మాత్రం లేదు.అందుకే వైసీపీలో ఎవరికి తోచినట్టు వారు నడుపుతున్నారు. ఆ మధ్య తాడేపల్లిలో వైసీపీ కేంద్ర కార్యాలయంలో పెద్ద రచ్చ జరిగినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన మహిళా న్యాయవాది, ప్రొఫెసర్ అయిన ఆమె భర్తతో కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే వైసీపీ నాయకులు అమర్యాదగా వ్యవహరించినట్టు తెలిసింది.దంపతులిద్దరూ కూడా వైఎస్ జగన్‌పై అభిమానంతో ఒక్క పైసా కూడా ఆశించకుండా, ప్రతిరోజూ ఉద్యోగానికి వెళ్లినట్టు క్యారీలు తీసుకెళ్లి మరీ పనిచేసేవారని తెలిసింది. అయితే మహిళా న్యాయవాది భర్త , ప్రొఫెసర్ గారి తెలివితేటలతో జగన్‌కు, అలాగే పార్టీ పెద్దలకు ఎక్కడ చేరువ అవుతారే అనే భయంతో, ఆయనపై దుష్ప్రచారం చేసి, చివరికి కార్యాలయానికి రాకుండా అడ్డుకున్నట్టు తెలిసింది. వీళ్లకు జరిగిన అన్యాయం గురించి వివరంగా రాస్తే, వైసీపీ పరువు సమీపంలో కృష్ణా నదిలో కలిసిపోతుంది.ఇదే టీడీపీలో అయితే, సదరు ప్రొఫెసర్, లాయర్ అయిన అతని భార్యను నెత్తిన పెట్టుకుని పార్టీ కార్యాలయంలో పని చేయించుకునేవాళ్లు. కానీ వైసీపీలో అలా జరగదంటే జరగదు. కాస్త తెలివి తేటలు, వ్యక్తిత్వం ఉన్నట్టు కనిపిస్తే చాలు, కోటరీకి అసలు నచ్చదు. వైఎస్ జగన్‌పై అభిమానంతో వైసీపీ కోసం స్వచ్ఛందంగా పని చేస్తామని ఎవరైనా వచ్చినా, పట్టుపట్టి మరీ తరిమి కొట్టేంత ఘనులు ఆ పార్టీలో వున్నారు.తాము మాత్రమే వైసీపీలో వుండాలని, జగన్‌కు తాము మాత్రమే తెలియాలనే సంకుచిత ధోరణి, రేపు అధికారం వస్తే, తాము మాత్రమే లబ్ధి పొందాలనే అత్యాశ ...అంతిమంగా వైసీపీకి నష్టం కలిగిస్తుంది.తాడేపల్లి వైసీపీ ప్రధాన కార్యాలయంలో తన చుట్టూ ఏం జరుగుతున్నదో కూడా తెలుసుకోలేని దయనీయ స్థితిలో జగన్ ఉన్నారు. ఉభయగోదావరి జిల్లాలకు చెందిన సదరు లాయరమ్మ, ఆమె భర్తకు వైసీపీ ప్రధాన కార్యాలయంలో ఎలాంటి అవమానం జరిగిందో సజ్జల రామకృష్ణారెడ్డిని పిలిపించుకుని జగన్ అడిగితే తెలుస్తుంది. అభిమానించే వారిని కూడా దూరం చేసేంత మహానుభావులున్నారు.ఇంకా బయటికి రాని ఇలాంటి బాధితులు ఇంకా ఎంతో మంది వున్నారు. కనీసం నియోజకవర్గ స్థాయి నాయకులతో జగన్‌కు ఆత్మీయ అనుబంధం లేకపోవడం వల్ల తలెత్తున్న సమస్యలివి. మరోవైపు నారా లోకేశ్ పార్లమెంట్ పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, వాళ్ల కుటుంబ సభ్యులతో కలిసి కలివిడిగా వ్యవహరిస్తున్నారు. వాళ్ల పిల్లలతో కలిసి ఆడుకుంటున్నారు. అలాగే కలిసి భోజనం చేస్తున్నారు. కష్టనష్టాల గురించి అడిగి తెలుసుకుంటూ, వ్యక్తిగత బంధాన్ని బలోపేతం చేసుకుంటున్నారు.లోకేశ్‌లా జగన్ ఎప్పుడైనా తన పార్టీ నాయకులతో కలిసి ఎప్పుడైనా అలా చేశారా? తను చుట్టూ ఉన్న ఐదారుగురితో తప్ప, ఎప్పుడైనా జగన్ పది నిమిషాల సమయాన్ని కేటాయించి మాట్లాడారా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలి. కావున వైసీపీలో కీలక నిర్ణయాలు తానే తీసుకోవాలి.అలాగే పార్టీలో ఏం జరుగుతున్నదో నిత్యం తెలుసుకుంటూ, దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. మరీ ముఖ్యంగా నాయకులు, కార్యకర్తలకు తరచూ అందుబాటులో వుండేలా వ్యవస్థను బలోపేతం చేసుకోవాలి. వైసీపీలో సరిదిద్దుకోవాల్సిన లోపాలు బోలెడు. అన్నీ అధికారం వచ్చాక సర్దుకుంటాయని అనుకుంటే పొరపాటు. ఇవన్నీ సరి చేసుకుంటేనే అధికారం వస్తుందని గుర్తించుకోవాలి.

# ఎన్నికల కోసం... పార్టీల వ్యూహాలు



నెల్లూరు,ఆంధ్రప్రదేశ్  రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలవుతున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీల వ్యూహాలు ఆసక్తిని పెంచుతున్నాయి. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ  జనసేన భారతీయ జనతా పార్టీ ఇప్పటికే ఎన్నికలపై దృష్టి పెట్టాయి. మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని నడుపుతున్న నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లోనూ ఇదే సమన్వయాన్ని కొనసాగించాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.సీట్ల పంపకమే ఇప్పుడు కూటమి లో ప్రధాన అంశంగా మారనుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ బలాన్ని చాటుకున్న జనసేన, బీజేపీలు స్థానిక ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను ఆశించడం సహజమే. అయితే నియోజకవర్గాలు, స్థానిక పరిస్థితులు, పార్టీకి ఉన్న బలం, అభ్యర్థుల సామర్థ్యం వంటి అంశాలను పరిశీలించి టీడీపీతో కలిసి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. డిమాండ్లు ఎన్ని ఉన్నా చివరికి మూడు పార్టీలు ఒకే తాటిపైకి వచ్చి ఎన్నికలను ఎదుర్కొంటాయని కూటమి నేతలు భావిస్తున్నారు.2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయాన్ని దృష్టిలో పెట్టుకుంటే స్థానిక పోరు కూడా ప్రతిపక్షానికి పెద్ద సవాలుగా మారనుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి సాధించిన విజయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పునకు కారణమైంది. ఇప్పుడు అదే ఐక్యతను గ్రామ స్థాయి నుంచి నగర స్థాయి వరకు కొనసాగించడం కూటమికి ముఖ్యమైన అంశంగా మారింది.మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ  మాత్రం ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోందన్న ప్రచారం జరుగుతోంది. 2024 ఎన్నికల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన ఆ పార్టీకి స్థానిక ఎన్నికలు తమ బలాన్ని తిరిగి నిరూపించుకునే అవకాశం కావచ్చని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమిలో విభేదాలు వస్తాయని గతంలో చేసిన అంచనాలు ఫలించకపోవడంతో ఇప్పుడు కొత్త వ్యూహంతో ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి వైసీపీకి ఏర్పడింది.కొంతకాలం క్రితం వామపక్ష పార్టీలతో కలిసి పనిచేసే అవకాశాలపై చర్చ జరిగింది. ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలు నిర్వహించాలనే ఆలోచన కూడా తెరపైకి వచ్చింది. అయితే ఆ స్థాయిలో రాజకీయ అవగాహన ముందుకు సాగలేదు. వామపక్షాలు తమ కార్యక్రమాలతో కొనసాగుతుండగా, వైసీపీ కూడా తన రాజకీయ మార్గంలోనే పయనిస్తున్నట్లు కనిపిస్తోంది.స్థానిక ఎన్నికలను 2024 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చకూడదని వైసీపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల కాలంలో రాజకీయ పరిస్థితులు మారాయని, ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. తమకు గతంలో బలమైన పట్టు ఉన్న ప్రాంతాలను నిలబెట్టుకోవడంతో పాటు కూటమికి అనుకూలంగా వెళ్లిన కొన్ని స్థానాల్లో తిరిగి పుంజుకోవాలని వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.అయితే స్థానిక ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికల కంటే భిన్నంగా ఉంటాయి. అభ్యర్థి వ్యక్తిగత ప్రభావం, స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, గ్రామ స్థాయి సంబంధాలు ఫలితాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఈసారి ఎవరి అంచనాలు ఎంతవరకు నిజమవుతాయన్నది ఎన్నికల ఫలితాల తర్వాతే స్పష్టమవుతుంది.మొత్తానికి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు కూటమి వర్సెస్ వైసీపీ మధ్య ప్రధాన పోరుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, ఇతర రాజకీయ సంస్థలు పోటీ చేసినా ప్రధాన రాజకీయ దృష్టి మాత్రం ఈ రెండు శిబిరాలపైనే ఉండనుంది. 2024లో కూటమికి వచ్చిన భారీ ఓటు మద్దతును అది ఎంతవరకు నిలబెట్టుకుంటుందో, వైసీపీ తన ఓటు శాతాన్ని ఎంతవరకు పెంచుకుంటుందో ఈ ఎన్నికలు తేల్చనున్నాయి.

తెరపైకి కులం కార్డు...

వైసీపీ నేతలు కుటుంబ వివాదాలకు, చేసిన నేరాలకు కులం రంగు పులుముకుంటున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును, అతని కుమారుడిని ఈడీ అరెస్టు చేసింది. లిక్కర్ రవాణా టెండర్లలో వందల కోట్ల అక్రమాలు, దొంగ ఇన్‌వాయిస్‌లు, లగ్జరీ ఆస్తుల కొనుగోలుపై ఆధారాలతో దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకుంటే? దానికి రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, రాజకీయ కక్ష సాధింపులకు గానీ ముడిపెడుతూ బీసీ రంగు పులిమి బయటపడాలనుకుంటున్నారు.మరొకవైపు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి బైక్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన దానయ్య అనే నిరుపేద గొర్రెల కాపరి బీసీ కాదా? ఆ నిరుపేద కుటుంబానికి కనీస సానుభూతి తెలపకపోగా, నిందితుడిని రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఏ తరహా బీసీ ఉద్ధరణకు సంకేతం? బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాల్సింది పోయి, కేసును నీరుగార్చే ప్రయత్నం చేసిన నేతలకు బీసీల పట్ల నిజమైన ప్రేమ ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## టీడీపీ సోషల్ మీడియా టాస్క్..టార్గెట్ జెన్ జీ,ఆల్ఫా

ఒంగోలు,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పాలనతో పాటు ప్రజలతో సమాచార సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా యువతను చేరుకోవడానికి సోషల్ మీడియాను సమర్థంగా ఉపయోగించుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యువతలో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి డిజిటల్ వేదికలకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి చేరువ చేయాలన్నది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది.ఇటీవలి కాలంలో రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా ఎంత కీలకంగా మారిందో పలు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా యువతలో రాజకీయ చర్చలు ఎక్కువగా డిజిటల్ వేదికలపైనే జరుగుతున్నాయి. ఒక అంశంపై ప్రజాభిప్రాయాన్ని వేగంగా ప్రభావితం చేయడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను నేరుగా ప్రజలకు వివరించేందుకు కూడా సోషల్ మీడియా ఉపయోగపడుతోంది. ఈ మార్పును గుర్తించిన బీజేపీ  కూడా డిజిటల్ ప్రచారంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా వ్యవస్థను మరింత చురుగ్గా మార్చాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కొంతమంది మంత్రుల డిజిటల్ కార్యకలాపాలపై చంద్రబాబు వివరాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది. నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వంగలపూడి అనిత , ఫరూక్ , కొండపల్లి శ్రీనివాస్ (తదితరులు తమ కార్యక్రమాలు, ప్రజా సంబంధిత విషయాలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నారని చర్చ జరిగింది.అయితే ఇంతటితో సరిపోదని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. ప్రతి మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ తమ నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలతో నిర్వహిస్తున్న సమావేశాలు, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను డిజిటల్ మాధ్యమాల ద్వారా వివరించాలని సూచించినట్లు తెలుస్తోంది. ఒకే వేదికకు పరిమితం కాకుండా ప్రజలు ఎక్కువగా ఉపయోగించే అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన చెప్పినట్లు సమాచారం.ముఖ్యంగా వచ్చే రెండేళ్లలో యువ ఓటర్ల ప్రాధాన్యం మరింత పెరగనుందని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువతకు ప్రభుత్వం ఏం చేస్తోంది, ఉపాధి, విద్య, పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో ఎలాంటి అవకాశాలు కల్పిస్తోంది అనే విషయాలను వారికి సులభంగా అర్థమయ్యే విధంగా చెప్పాల్సిన అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి  ప్రారంభించిన 'జగన్ 2.0' యాప్ కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. డిజిటల్ వేదికల ద్వారా ప్రజలతో నిరంతర సంబంధం కొనసాగించే విషయంలో రాజకీయ నాయకులు మరింత ముందుండాలని చంద్రబాబు సూచించినట్లు తెలుస్తోంది. ప్రజలు ప్రశ్నిస్తే స్పందించడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడం, చేసిన పనులను పారదర్శకంగా వివరించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.అయితే సోషల్ మీడియాపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రధాన మీడియాకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. టెలివిజన్, పత్రికలు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా.. అన్ని వేదికలను సమన్వయంతో ఉపయోగించినప్పుడే ప్రభుత్వ సందేశం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తుందని భావిస్తున్నారు. మొత్తంగా కూటమి ప్రభుత్వం డిజిటల్ కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేసి యువతతో ప్రత్యక్ష సంబంధం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది.

## జోగి ఫ్యామిలీ అడ్డంగా బుక్...

విజయవాడ, మాజీ మంత్రి జోగి రమేష్ తన కుటుంబాన్ని రాజకీయాల కోసం వీధిన పడేసారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కోడలిని కుమార్తె కంటే బాగా చూసుకున్నానని ప్రకటించారు. ఇదంతా కల్పితం మాత్రమేనని.. దీని వెనుక చంద్రబాబు, లోకేష్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఉన్నారని.. పెద్ద పెద్ద వారి కుటుంబాల్లోనే వివాదాలు ఉన్నాయని.. తన కుటుంబంలో కేవలం తన కుమారుడు, కోడలి మధ్య విభేదాలు మాత్రమేనని.. తమ కోడలి ఫిర్యాదు కంటే ముందే తాము విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు నిన్ననే జోగి రమేష్ మీడియా ముఖంగా ప్రకటన చేశారు. నెల రోజులుగా క్షోభ అనుభవిస్తున్నామని చెప్పుకొచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ జోగి రమేష్ కోడలు మేఘన, ఆమె తండ్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా ముందుకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించే ప్రయత్నం చేశారు.తనకు అత్తవారింట్లో ఎదురైన పరిణామాల గురించి వివరిస్తూ కన్నీటి పర్యంతం అయ్యారు మేఘన. సంసారానికి పనికిరాని లోపం కొడుకు జోగి రాజీవ్ కు ఉందని తెలిసి.. కేవలం పరువు, భారీ కట్నం కోసమే తమకు అబద్ధాలు చెప్పి మోసపూరితంగా పెళ్లి చేస్తారని మేఘన కుండబద్దలు కొట్టారు. మరింత అదనపు కట్నం తెస్తేనే నీ నీ భర్తకు ఫీలింగ్స్ వస్తాయి.. నువ్వు సంతోషంగా ఉంటావు అంటూ జోగి రమేష్ భార్య శకుంతల తనను చిత్రహింసలకు గురి చేసిందని మేఘన చెప్పారు. బయట సమాజానికి హిందూ సంప్రదాయ కుటుంబం గా బిల్డప్ ఇచ్చే జోగి రమేష్ ఇంట్లో.. అసలు స్వరూపం వేరని.. వారిది పక్కా క్రిస్టియన్ కుటుంబమని మేఘన ఆధారాలతో సహా బయటపెట్టారు.కొత్తగా అత్తవారింట్లో అడుగుపెట్టిన తనకు పూజ చేసేందుకు ప్రత్యేకమైన గది కూడా లేదని.. తాను హిందూ దేవుళ్ళ ఫోటోలు పెట్టి పూజలు చేస్తుంటే అడ్డుకునేవారని కొచ్చారు. హారతి పళ్లాలు, అగరబత్తులను నేలకేసి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అత్త హిందూ దేవుళ్లను అసభ్యంగా దూషిస్తూ.. బలవంతంగా మతం మార్చేందుకు విపరీతంగా ఒత్తిడి చేశారని ఆరోపించారు. పెళ్లయిన కేవలం రెండు నెలలకి తనను వదిలించుకునే కుట్రతో జోగి రాజీవ్ కోర్టులో రహస్యంగా పిటిషన్ దాఖలు చేశాడు అన్న సంచలన విషయాన్ని కూడా ఆమె వెల్లడించారు. వివాహ సమయంలో కేజీన్నర బంగారం, కోట్లాది రూపాయల ఆస్తులు ఇచ్చినా.. తమ కుమార్తెను అంతమొందించేందుకు ప్రయత్నించారని మేఘన తండ్రి మీడియా ముందు కన్నీటి పర్యంతమవుతూ చెప్పారు.మరోవైపు న్యాయం కోసం తాము వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వాన్ని కలిశామని కూడా చెప్పుకొచ్చారు. జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు ప్రయత్నం చేస్తే ఆయన పెద్దగా ఆసక్తి చూపలేదని చెప్పారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి పరిస్థితిని వివరిస్తే ఆయన సమస్యను పరిష్కరించడం మానేసి కాలయాపన చేస్తూ రాజీ కుట్రలకు పాల్పడ్డారు. అన్ని దారులు మూసుకుపోవడంతో.. గత్యంతరం లేక స్థానిక ఎమ్మెల్యే వద్దకు వెళ్లి న్యాయం చేయాలని వేడుకున్నామని.. జోగి రమేష్ తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తమపై టిడిపి ముద్ర వేసి రాజకీయ రంగు పులిమారని మేఘన నిప్పులు చెరిగారు. అయితే ఇప్పుడు అసలు విషయం బయటకు రావడంతో జోగి రమేష్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జోగి రమేష్ ఫ్యామిలీ ది ఘోరమైన మోసం అని ఎక్కువమంది అభిప్రాయ పడుతున్నారు.

# విమానాశ్రయాల అభివృద్ధికి పీపీపీ



న్యూఢిల్లీ,దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న సంగతి తెలిసిందే. అందుబాటు ధరల్లో ప్రయాణాలు చేసే అవకాశం కల్పించడం, పెరుగుతున్న ఆదాయం, బిజీ షెడ్యూల్స్ ఏదైనా కారణం కావొచ్చు కాలం గడుస్తున్న కొద్దీ విమానాశ్రయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా విమానాశ్రయాల్లో మౌలిక వసతుల్ని మరింత అభివృద్ధి చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా తిరుపతి, వారణాసి సహా మొత్తం 11 విమానాశ్రయాల్ని ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రతిపాదన సిద్ధమైంది. ఆగస్ట్ 4న జరిగిన పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఆమోదం లభించింది. సుమారు 50 ఏళ్ల రాయితీ కాలానికి ప్రైవేట్ ఆపరేటర్లకు ఈ ఎయిర్‌పోర్టుల్ని అప్పగించాలని కేంద్రం యోచిస్తోంది.ప్రభుత్వ అంచనాల ప్రకారం ఈ 11 విమానాశ్రయాల అభివృద్ధి, విస్తరణ కోసం ప్రైవేట్ సంస్థలు దాదాపు రూ. 8622 కోట్ల మేర పెట్టుబడుల్ని పెట్టాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ విమానాశ్రయాల్ని మొత్తం 5 బండిల్స్‌గా విభజించి, ప్రతి బండిల్‌ను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించనున్నారు. దీంట్లో భువనేశ్వర్- హుబ్బళ్లి బండిల్‌కు అన్నింటికంటే ఎక్కువగా రూ. 2725 కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అంచనా. వారణాసి- గయా- కుషీనగర్ బండిల్‌కు రూ. 2467 కోట్లు, రాయ్‌పూర్- ఔరంగాబాద్‌కు రూ. 1496 కోట్ల పెట్టుబడి పడుతుందని తెలుస్తోంది. ఇక తిరుపతి- తిరుచిరాపల్లి ఒక బండిల్‌లో ఉండగా వీటి విస్తరణకు రూ. 1411 కోట్లు పడుతుందని అంచనా వేస్తున్నారు. చివరగా అమృత్‌సర్- కాంగ్రా బండిల్‌కు రూ. 523 కోట్ల పెట్టుబడి అవసరమవుతుంది. ఈ విధానంలో పెద్ద విమానాశ్రయాల్ని చిన్న ఎయిర్‌పోర్ట్స్‌తో కలిపి ఒక బండిల్‌గా రూపొందిస్తున్నారు.విమానాశ్రయాల నిర్వహణ మొత్తం కొద్ది సంస్థల చేతుల్లోనే ఉండకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఒకే బిడ్డర్‌కు ఎన్ని విమానాశ్రయ బండిల్స్ ఇవ్వాలనే అంశంలో పరిమితి విధించాలని నిర్ణయించింది. ఇక్కడ ఒకే సంస్థకు ఎక్కువ ప్రాజెక్టులు దక్కితే భారీగా అప్పులు చేయడం వల్ల ఎదురయ్యే ఆర్థిక సమస్యల్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది. అయితే ఒకే సంస్థకు ఎన్ని బండిల్స్ ఇవ్వాలనే విధానంపై ఇంకా తుది నిర్ణయం మాత్రం తీసుకోలేదు. ప్రైవేట్ సంస్థలకు అప్పగించిన తర్వాత ఇప్పటికే ఆమోదం పొందిన మూలధన వ్యయంతో పాటు విమానాశ్రయాల సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన అదనపు పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది.గతంలో 2019లో కూడా విమానాశ్రయాల ప్రైవేటీకరణకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. అప్పుడు 6 విమానాశ్రయాల్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు బిడ్డింగ్ నిర్వహించగా, అదానీ గ్రూప్ అన్ని విమానాశ్రయాల్ని దక్కించుకుంది. ఇదే సమయంలో ఇప్పుడు దేశీయ విమాన ప్రయాణానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్, ఢిల్లీ విమానాశ్రయాల విస్తరణకు కూడా భారీ పెట్టుబడులు వస్తున్నాయి. హైదరాబాద్ విమానాశ్రయం విస్తరణ కోసం సుమారు రూ. 13800 కోట్లు, ఢిల్లీ విమానాశ్రయం కోసం రూ .5600 కోట్లు పెట్టుబడులు పెట్టే ప్రణాళికలు ఉన్నాయి.

## దేశ భద్రతపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు..

2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా ఎదగాలంటే దేశ అంతర్గత భద్రత మరింత బలోపేతం కావాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.అక్రమ చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా సైబర్ ముప్పులు వంటి సవాళ్లను ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.ఇంటెలిజెన్స్ బ్యూరో నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీ కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు.ఆ సమావేశంలో అమిత్ షా భవిష్యత్ భద్రతా వ్యూహంపై కీలక సూచనలు చేశారు.వచ్చే 15-20 ఏళ్లలో దేశ భద్రతను ప్రభావితం చేసే పరిణామాలను ఇప్పటి నుంచే అంచనా వేసి వ్యూహాలను రూపొందించాలని భద్రతా, నిఘా సంస్థలను కోరారు. అక్రమ వలసదారుల అంశంపై అమిత్ షా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ‘ఈ దేశం ధర్మశాల కాదు. ఈ దేశంలో నివసించే హక్కు కేవలం ఈ దేశ పౌరులకు మాత్రమే ఉంటుంది’ అని అన్నారు. అక్రమ చొరబాట్లు దేశ భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.భద్రతా వ్యవస్థలు అక్రమ చొరబాట్లను ముందుగానే గుర్తించి అడ్డుకోవాలని సూచించారు. దేశంలోని భూ సరిహద్దుల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టిందని హోంమంత్రి తెలిపారు.

# కొండా సురేఖ వివాదంలో శరవేగంగా మారుతున్న పరిణామాలు..

హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ వ్యవహారం చిలికి చిలికి గాలివానగా మారింది. మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సంబంధిత వివాదాలపై పార్టీ హైకమాండ్ త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అయితే అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాకముందే ఈ సమస్యను పరిష్కరించాలని, కొండా వివాదానికి చెక్ పెట్టాలని అధిష్టానం భావిస్తోంది.

కేసీ వేణుగోపాల్, ఖర్గే ఢిల్లీ వచ్చాక ఫైనల్ డెసిషన్

రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం, పీసీసీ ఇప్పటికే కొండా సురేఖ మరియు చిన్నారెడ్డి వివాదానికి సంబంధించిన సమగ్ర నివేదికలు ఢిల్లీకి పంపింది. పార్టీ ప్రతిష్టకు జరిగిన నష్టం, తాజా పరిణామాలపై హైకమాండ్ నిశితంగా పరిశీలన చేస్తోంది. ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన సోమవారం ఢిల్లీకి తిరిగి రానున్నారు. అదే సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం బెంగళూరు నుంచి ఢిల్లీకి చేరుకోనున్నారు.

బెంగళూరు లో ఖర్గెను కలిసి కొండా సురేఖ వ్యవహారశైలిపై భట్టి నివేదిక

తాజా పరిణామాల క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బెంగళూరులో ఖర్గేను కలిశారు. దాదాపు 40 నిమిషాల పాటు ఏకాంత సమావేశంలో తాజా పరిస్థితులను వివరంగా చెప్పారు. కొండా సురేఖ వ్యవహారశైలి వల్ల పార్టీకి తీవ్ర నష్టం జరిగిందని, ఆమెపై క్రమశిక్షణా చర్యలు అవసరమని చెప్పినట్టు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ ఈ అంశంపై ఏకాభిప్రాయంతో ఉన్నారని కూడా తెలిపారు.

కొండా సురేఖను మంత్రి పదవి నుండి తప్పించే అవకాశం



ఖర్గే రాష్ట్ర నాయకత్వం పంపిన నివేదికను ఇప్పటికే పరిశీలించినట్లు స్పష్టం చేశారు. ఏఐసీసీ వర్గాల ప్రకారం, కొండా సురేఖను స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని కోరే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తుంది. ఆమె నిరాకరిస్తే మంత్రివర్గం నుంచి నేరుగా తొలగించే అవకాశం కూడా ఉందని చర్చలు సాగుతున్నాయి. అయితే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆమెను మంత్రి పదవి నుండి తప్పించే అవకాశం కూడా అధిష్టానం పరిశీలిస్తోంది.

అసెంబ్లీ సమావేశాలకు ముందే తుది ప్రకటన

ఇక మరోవైపు చిన్నారెడ్డి వ్యవహారంపైనా పార్టీ నివేదికల ఆధారంగా చర్యలు ఉంటాయని తెలుస్తోంది. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లతో ఉన్నత స్థాయి సమావేశం జరిగిన తర్వాతే తుది ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాలకు ముందే ఈ వివాదాన్ని పరిష్కరించి ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా పార్టీని గాడిలో పెట్టటం హైకమాండ్ లక్ష్యంగా పెట్టుకుంది.

# నేపాల్‌లో జల ప్రళయం.. మానస సరోవర్ యాత్రకు బ్రేక్



నేపాల్: నేపాల్-టిబెట్ ఫ్లాష్ ఫ్లడ్స్ నేపథ్యంలో కైలాస మానస సరోవర్ యాత్రకు బ్రేక్ పడింది. జలప్రళయం వల్ల నెల రోజులపాటు మానస సరోవరం మార్గం మూసి వేత వేశారు అధికారులు. నేపాల్ మీదుగా జరగాల్సిన మానస సరోవర యాత్రకు రోడ్డు మార్గాలు మూసుకుపోయాయి. గురువారం ఖాట్మాండ్ నుంచి సరోవర్ యాత్రను నిలిపి వేసినట్టు ప్రకటన చేసింది. టూరిస్టులు తమ స్వస్థలాలకు వెళ్లిపోవాలని సూచించారు నేపాల్-టిబెట్ బోర్డర్ అధికారులు.

నేపాల్‌లో జల ప్రళయం.. మానస సరోవర్ యాత్రకు బ్రేక్

భారతదేశం నుండి కైలాష్ మానస సరోవర్ యాత్రకు మూడు ముఖ్యమైన మార్గాలు ఉన్నాయి. ఒక మార్గం ఉత్తరాఖండ్‌లోని పిథోరగఢ్ మీదుగా ఉంది. మరొకటి సిక్కింలోని నాథూ లా పాస్ మీదుగా ఉంది. ఈ రెండు మార్గాల్లో ప్రయాణాన్ని భారత ప్రభుత్వం నిర్వహిస్తుంది. నేపాల్ మీదుగా వెళ్లే మరో మార్గం కూడా ఉంది. అక్కడ నుంచి టూరిస్టులు.. టూర్ ఆపరేటర్ల ద్వారా కైలాష్ మానసరోవర్ యాత్రకు ప్రయాణిస్తారు. ఎందుకంటే మిగతా రెండు మార్గాల కంటే ఈ మార్గం రాకపోకలకు సులువుగా ఉంటుంది.

మార్గం నెంబరు-1

నేపాల్ నుండి కైలాష్ మానసరోవర్ యాత్ర చేసే ప్రయాణం చాలా భిన్నంగా ఉంటుంది. అక్కడి నుంచి ప్రైవేట్ టూర్ ఆపరేటర్లు.. సాధారణంగా యాత్రికులను టిబెట్‌కు తీసుకెళ్తారు. ఆ రూట్లోనే రసువాగఢి-కెరుంగ్ మార్గం ఉంది. ఇందులో కాఠ్మండు - స్యాఫ్రుబేసి - టిమురే - రసువాగఢి -కెరుంగ్/గ్యిరాంగ్ - సాగా - మానసరోవర్ - డార్చెన్ - కైలాష్ ఉంటాయి. ఈ మార్గంలో నేపాల్ వైపు రసువా-చైనా వైపు కెరుంగ్/గ్యిరాంగ్ ఉంటాయి. ఇక్కడే నేపాల్-టిబెట్ సరిహద్దును యాత్రికులు యాత్రకు వెళ్తుంటారు.

మార్గం నెంబరు-2

నేపాల్ నుండి కైలాష్ మానస సరోవర్ యాత్రకు వెళ్ళే మరో ప్రధాన మార్గం. ఇది పశ్చిమ నేపాల్ ద్వారా వెళ్తుంది. ఈ మార్గంలో కాఠ్మండు-నేపాల్‌గంజ్-సిమికోట్-హిల్సా-యారి సరిహద్దు-పురాంగ్/తక్లకోట్-మానసరోవర్-డార్చెన్-కైలాష్ ఉన్నాయి. ఈ మార్గంలో తొలుత నేపాల్‌లోని నేపాల్‌గంజ్, సిమికోట్ ప్రాంతాలకు విమానంలో ప్రయాణించాలి. అక్కడి నుంచి హెలికాప్టర్ల ద్వారా హిల్సాకు వెళ్తారు. అక్కడి నుండి నేపాల్-టిబెట్ సరిహద్దు దాటి చైనాలోని టిబెట్ ప్రాంతంలోకి ప్రవేశిస్తాయి. ఈ మార్గం టిబెట్‌లోని లాసా మీదుగా వెళ్లాల్సి వుంటుంది.

మార్గం నెంబర్-3

భోటేకోశి నదికి వచ్చిన జల ప్రళయం కారణంగా కైలాష్ మానసరోవర్ యాత్రను ప్రభావితం చేసింది. ఈ వరద కారణంగా గతంలో ఉన్న రసువాగఢి-కెరుంగ్ మార్గానికి అంతరాయం ఏర్పడింది. ఆకస్మిక వరదల వల్ల స్యాఫ్రుబేసి-తిమురేతో సహా సరిహద్దు ప్రాంతాలను ప్రభావితం చేసింది. రోడ్లు, వంతెనలు దారుణంగా దెబ్బతిన్నాయి. రసువాగఢి మీదుగా జరిగే సరిహద్దు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఈ యాత్ర ఎందుకు అంత ప్రమాదకరం?

సముద్ర మట్టానికి సుమారు 14,000 నుండి 19,500 అడుగుల ఎత్తులో మానస సరోవర్ యాత్ర సాగుతుంది. కష్టతరమైన మార్గాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా అత్యంత ప్రమాదకరమైనదిగా చెబుతారు. ఆ ఎత్తులో ఆక్సిజన్ స్థాయి చాలా తక్కువగా ఉంటుంది. దీనివల్ల శ్వాస తీసుకోవడంలో యాత్రికులు ఇబ్బందులు పడుతుంటారు. తలనొప్పి, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా కైలాస పర్వతం చుట్టూ సుమారు 52 కిలోమీటర్లు పొడవు ప్రదక్షిణ ఉంటుంది. అది కాలినడకన పూర్తి చేయడానికి మూడు రోజులు పడుతుంది.ఈ మార్గం రాళ్లతో నిండి ఉంటుంది, అంతేకాదు ఎగుడు దిగుడు, నిటారుగా ఉండటం వల్ల కీళ్లు, పాదాలపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. మధ్యలో డోల్మాలా కనుమ ఎక్కడం అత్యంత కష్టమైనది. నిటారుగా మంచుతో నిండి ఉంటుంది. అయితే దాని దిగువ మార్గం చాలా చల్లగా ఉంటుంది. శరీరంలోని శక్తిని వేగంగా తగ్గిస్తుంది. అక్కడ వాతావరణం క్షణక్షణం మారుతూ ఉంటుంది. బలమైన చల్లని గాలులు, మంచు కురవడం, ఉష్ణోగ్రత అకస్మాత్తుగా గడ్డకట్టే స్థాయికి పడిపోవడం వంటివి ప్రయాణికులకు సవాళ్లను విసురుతాయి.

## టీపీసీసీ సోషల్ మీడియా ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నవీన్ పెట్టెం

హైద్రాబాద్ ,టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మరియు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సమక్షంలో.. టీపీసీసీ సోషల్ మీడియా నూతన ఛైర్మన్ గా నవీన్ పెట్టెం గాంధీ భవన్ లో అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఛైర్మన్‌తో పాటు నూతనంగా నియమితులైన సోషల్ మీడియా కన్వీనర్లు, కోఆర్డినేటర్లు కూడా తమ తమ బాధ్యతలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ, టీపీసీసీ మీడియా ఛైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి , జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ , రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ , యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి , వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మరియు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.?పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నవీన్ పెట్టెం మాట్లాడుతూ.. “ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, క్షేత్రస్థాయి మరియు గ్రామస్థాయి

# మాజీ ‘కిరణం’ ఉదయించేనా ?!

అమరావతి,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పాత్ర కీలకమైంది. వైఎస్ మరణం అనంతరం రోశయ్య కొన్నాళ్లు ముఖ్యమంత్రిగా ఉండగా ఆ తరువాత అనూహ్యంగా కిరణ్ కుమార్ రెడ్డికి సీఎం పదవి దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆయనే చివరి ముఖ్యమంత్రి. రాష్ట్ర విభజనకు నిరసనగా ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి జై సమైక్యాంధ్ర పార్టీని స్థాపించి 2014 ఎన్నికల్లో పోటీ చేశారు.2014లో పార్లమెంటులో తెలంగాణ రాష్ట్రా ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ విభజన బిల్లు పాస్ అయినప్పుడు ఆయన తన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే పదవులతో పాటు కాంగ్రెస్ పార్టీకి కూడా రాజీనామా చేశాడు. అనంతరం జై సమైక్యాంధ్ర పార్టీ ఏర్పాటు చేసి ఎన్నికలకు వెళ్లగా ఆ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేదు. ఎక్కడా డిపాజిట్ కూడా దక్కలేదు. దీంతో ఆయన 2018లో పార్టీని రద్దు చేసి తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తిరిగి 2023తో కాంగ్రెస్ పార్టీని వదిలి బీజేపీ కేంద్ర కార్యాలయం ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ, జాతీయ ప్రధాన కార్యదర్శి అలీలోరుణ్ సింగ్ సమక్షంలో బీజేపీలో చేరారు.కాంగ్రెస్ మాజీ మంత్రి నల్లారి అమరనాథ్ రెడ్డి కుమారుడు అయిన కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబం 1952 నుండి కాంగ్రెస్ పార్టీలోనే ఉంది. కిరణ్ కుమార్ రెడ్డి క్రికెటర్ గా రాష్ట్ర, సౌత్ జోన్ స్థాయిలో ఆడాడు. తండ్రి మరణం అనంతరం తొలిసారి ఆయన 1989లో తొలిసారి వాయల్పాడు నుండి గెలిచారు.1994లో అదే స్థానం నుండి ఓడిపోయి తిరిగి 1999, 2004 ఎన్నికల్లో వరసగా గెలిచారు. 2009లో పీలేరు నుండి విజయం సాధించి శాసనసభ స్పీకర్ గా పనిచేశారు. ఆ తర్వాత అనూహ్యంగా కాంగ్రెస్ అధిష్టానం సీఎంగా అవకాశం ఇవ్వడంతో 2010 నవంబర్ నుండి 2014 మార్చి 1 వరకు ఆ పదవిలో కొనసాగారు.2023లో



బీజేపీలో చేరిక అనంతరం ఆయన 2025 నుండి బీజేపీ రాష్ట్ర కమిటీలో శాశ్వత ఆహ్వానితుడిగా కొనసాగుతున్నారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో రాజంపేట ఎంపీగా పోటీ చేసిన 76,071 ఓట్ల తేడాతో వైసీపీ అభ్యర్థి మిధున్ రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో ఆయన 5,68,773 ఓట్లు సాధించి రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు.అయితే కేంద్రంలోని ఎన్డీఎ ప్రభుత్వం ఆయనకు గవర్నర్ గా అవకాశం కల్పించబోతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఉజ్జెకిస్తాన్ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్రమోడీ తిరిగి వచ్చిన అనంతరం కేంద్ర క్యాబినెట్లో మార్పులు, చేర్పులతో పాటు, కొత్తగా వివిధ రాష్ట్రాలకు గవర్నర్లను నియమించనున్నారని, అందులో కిరణ్ కుమార్ రెడ్డికి అవకాశం దక్కబోతుందని చెబుతున్నారు. మరి ఈ ‘కిరణం’ మరోసారి ఉదయిస్తుందా ? లేదా ? వేచిచూడాలి.


# కొండా సుష్మిత ..ప్లాన్ బీ ఏంటి ?

హైదరాబాద్,‘నా కూతురు సుష్మిత ప్లాన్ ఎలో మాట్లాడింది. ఆమె వద్ద ఉన్న ప్లాన్ బి ఏంటో నాకు తెలియదు. ఆమె వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతం. మాకు ఎలాంటి సంబంధం లేదు. మాకు ఆమెను ప్రశ్నించే హక్కు లేదు. ఆమె వయసు 38. ఆమెకు 12 ఏళ్ల కూతురు ఉంది. ఆమె చిన్న పిల్ల కాదు. మాకు మాత్రం కాంగ్రెస్ పార్టీని వీడే ఆలోచన లేదు. గాంధీ కుటుంబంపై పూర్తి విశ్వాసం ఉంది’.ప్రజాభవన్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన అనంతరం కొండా సుష్మిత తండ్రి కొండా మురళి మీడియాతో మాట్లాడిన మాటలు ఇవి. రేవంత్ రెడ్డి మీద సుష్మిత ఆరోపణల నేపథ్యంలో క్రమశిక్షణ సంఘం పార్టీ అధిష్టానానికి కొండా సురేఖను మంత్రి పదవి నుండి తొలగించాలని సిఫారసు చేసిన నేపథ్యంలో కొండా మురళి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.తాను తన కూతురు వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో మల్లు భట్టి విక్రమార్కను కలవలేదని, కేవలం ఒక బిల్లు విషయంలో కలిశానని కొండా మురళి చెబుతున్నారు. అయితే కొండా మురళితో భేటీ అనంతరం ఈ రోజు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క బెంగుళూరుకు వెళ్లి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలవడం ఆసక్తికరంగా మారింది. ఒకవైపు తన వ్యాఖ్యలకు తాను బాధ్యత వహించనని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేయగా, తన కూతురు వద్ద ఉన్న ప్లాన్ బి ఏంటో తనకు తెలియదని కొండా మురళి వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక ఇంతకుముందే కొండా సురేఖ బెంగళూరు వెళ్లి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో గంట పాటు భేటీ అయ్యారు. ఇప్పుడు భట్టి విక్రమార్క కూడా కొండా మురళితో భేటి అనంతరం ఖర్గే వద్దకే వెళ్లడం గమనార్హం.పరకాల నుండి వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తిరిగి పోటీ చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో, అభ్యర్థులను ప్రకటించడానికి రేవంత్ రెడ్డి ఎవరంటూ సుష్మిత పలు ఆరోపణలు చేసింది. అయితే కాంగ్రెస్ పార్టీలో సుష్మితకు సభ్యత్వం లేకపోవడంతో ఆమె మీద చర్యలు తీసుకునే అంశం కాంగ్రెస్



పార్టీకి క్లిష్టతరంగా మారింది.పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నేరుగా కొండా సురేఖను ఈ విషయంలో తప్పుపట్టారు. కూతురును అదుపులో ఉంచుకోవాల్సిన బాధ్యత ఆమె మీదనే ఉందని, గతంలో ఇలాంటి వ్యాఖ్యలు చేసి రాజీ పడ్డారని, తిరిగి ఇప్పుడు కూడా అలాగే వ్యవహరించి, పార్టీకి నష్టం కలిగిస్తున్నారని వారు అంటున్నారు. క్రమశిక్షణ సంఘం కూడా కొండా సురేఖ పదే పదే పార్టీకీ నియమావళికి విరుద్ధంగా మాట్లాడుతున్నారని, పలుమార్లు చెప్పినా వ్యవహారశైలి మారడం లేదని, అందుకే ఆమెను పదవి నుంచి తప్పించాలని అధిష్టానానికి చేసిన సిఫార్సులో పేర్కొన్నది.ఒక వైపు క్రమశిక్షణ సంఘం పదవి నుండి తప్పించాలని సిఫార్సు చేసిన తరువాత కూడా సుష్మిత తండ్రి కొండా మురళి ప్లాన్ బి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అసలు ఈ వివాదాన్ని వీరు ఎక్కడికి తీసుకెళ్లాలని భావిస్తున్నారు ? వారి వ్యాఖ్యల వెనక ఉద్దేశం ఏంటి ? వీరిని వెనకనుండి ప్రోత్సహిస్తున్నది ఎవరు ? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక మరోవైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కొండా సురేఖ దంపతులు బీజేపీలోకి వస్తే ఆహ్వానిస్తామని చెప్పడం కొసమెరుపు.

# బాబు ఊహించిందే నిజమైంది.. వైసీపీ కోర్టుకెక్కింది!




అమరావతి,ఏపీ సీఎం చంద్రబాబు ఊహించిందే జరిగింది!. స్థానిక సంస్థల ఎన్నికలను అక్టోబరులో నిర్వహించాలని బాబు నిర్ణయించారు. తద్వారా.. కేంద్రం ఇచ్చే 16వ ఆర్థిక సంఘం నిధులను తీసుకురావాలని లెక్కలు వేసుకున్నారు. సుమారు 12 వేల కోట్ల రూపాయల మేరకు ఆయా పంచాయతీలు, నగర పాలక సంస్థలకు ఈ నిధులు అందనున్నాయి. తద్వారా పనులు వేగంగా చేసేందుకు.,. అభివృద్ధి బాట పట్టించేందుకు అవకాశం ఉంటుందని లెక్కలు వేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అక్టోబరు నాటికి నోటిఫికేషన్ ఇచ్చేసి.. ఎన్నికలకు వెళ్లేలా ప్లాన్ చేశారు.అయితే.. ఈ ఎన్నికల ప్రక్రియకు, కేంద్రం నుంచి వచ్చే 16వ ఆర్థిక సంఘం నిధులకు వైసీపీ అడ్డుతగిలే అవకాశం ఉందని బాబు ఇటీవల అంచనా వేసుకున్నారు. ఈ విషయాన్ని మంత్రులకు కూడా చెప్పారు. --వైసీపీ అడ్డుపడే అవకాశం ఉంది. దీనిపై మనం ఆలోచన చేయాలి. కోర్టుకు వెళ్తారో.. లేక కేంద్రం వద్ద అడ్డు పెడతారో చూడాలి.-- అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఆయన వేసిన అంచనా అక్షరాల నిజమైంది. తాజాగా వైసీపీ స్థానిక ఎన్నికల విషయంపై హైకోర్టును ఆశ్రయించింది. అక్టోబరు 3వ తేదీకి ముందే నోటిఫికేషన్ ఇచ్చే ఆలోచనలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉందని.. దీనిని అడ్డుకోవాలని కోరింది.దీనికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియను వైసీపీ బూచిగా చూపించింది. ఈ ఏడాది సర్ ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా పూర్త యిందని.. ఈ క్రమంలో 40 లక్షల మందికి పైగా ఓట్లను తొలగించారనితెలిపింది. దీనికి సంబంధించిన పూర్తిస్థాయి తుది ఓటర్ల జాబితా అక్టోబరులో ప్రకటించనున్నారని పేర్కొంది. ఆ జాబితా ఆధారంగానే ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర సర్కారును , రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించాలని కోరుతూ.. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో బుధవారం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన కోర్టు విచారణకు స్వీకరించింది.అయితే.. వైసీపీ ఆరోపిస్తున్నట్టుగా.. స్థానికసంస్థల్లో ఎవరికీ అన్యాయం జరగబోదని ఎన్నికల సంఘం చెబుతోంది. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నాటికి ఎవరికి ఓటు హక్కు ఉంటే వారంతా స్థానిక ఎన్నికల్లో ఓటు వేసుకునే అవకాశం ఇస్తామని.. అది అన్నా పార్టీలకు(వైసీపీ సహా) మేలు చేస్తుందని చెబుతోంది. కానీ, వైసీపీ వ్యూహం వేరేగా ఉంది. అక్టోబరులోగా ఎన్నికలు జరగకపోతే.. కేంద్రం నుంచి వచ్చే సుమారు 12 వేల కోట్ల రూపాయలు రద్దయిపోతాయి. తద్వారా.. ప్రభుత్వం ఇరుకున పడుతుంది. ఇదే ఇప్పుడు వైసీపీ లక్ష్యంగా ఉందని.. అందుకే కోర్టు మెట్లు ఎక్కిందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140